
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 15 మే 2024 5





కూలిన బతుకులు : ప్రమాదంలో మృతులు



ఉడిమూడి రహదారిపై మృతుల బంధువుల ధర్నా

దూసుకొచ్చిన మృత్యువు

పి.గన్నవరం/అంబాజీపేట/రావులపాలెం, మే 14 : ఉదయం నుంచి ఆనందంగా పనిచేస్తున్నారు.. కాసేపట్లో పనిముగించుకుని ఇళ్లకు వెళ్లిపోదామని చీకట్లోనే పని చేస్తుండగా ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది.. నలుగురు కూలి బతుకులను కూల్చివేసింది.. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద 10 మంది కూలీలు ట్రాక్టర్‌పై ధాన్యం లోడు చేస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. జట్టు కూలీలతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. పి.గన్నవరం మండలం ఆదిమూలవారిపాలెంలో ఒకే కుటుంబానికి చెందిన చిలకలపూడి మణిబాబు (31), చిలకలపూడి సురేష్, గంటి పెదపూడి గ్రామానికి చెందిన నూకపెయ్యి శివ (32), వాసంశెట్టి సూర్యప్రకాష్ (48), ఈరి కట్టయ్య (46)లతో పాటు మరో ఆరుగురు కలిసి మంగళవారం తెల్లవారుజామున ధాన్యం లోడు చేసేందుకు చింతావారిపేట వచ్చారు.ఉదయం నుంచీ ధాన్యం పట్టుబడులు పట్టి రాత్రి 7 గంటల సమయంలో ప్రధాన రహదారి చెంతనే ట్రాక్టర్ ధాన్యం బస్తాలను లోడ్ చేసి పగ్గం బిగిస్తున్నారు.ఈ సమయంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టరును బలంగా ఢీకొని జట్టు కూలీలపై నుంచి దూసుకుపోయింది.నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా బస్సు సుమారు 10 మీటర్ల మేర ఈడ్చుకుపోవడంతో మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో రహదారిపై చిందవందరగా పడ్డాయి. దీంతో భయానక వాతావరణం ఏర్పడింది. మృతదేహాల వద్ద కుటుంబీకులు రోదిస్తున్న తీరు ప్రయాణికులను సైతం కలిచివేసింది. ఒక మృతదేహం నుజ్జునుజ్జుకావడంతో మూటకట్టారు.ఇద్దరికి తీవ్ర గాయాలు నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. జట్టు కూలీలు చిలకలపూడి సురేష్, బొరుసు నానిలకు తీవ్ర గాయాలయ్యాయి. సురేష్‌ను తొలుత పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. నానితో పాటు గాయాలపాలైన ప్రయాణికులను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పి.గన్నవరం నుంచి ఈతకోట వెళ్లే రహదారిలో ప్రయాణం ప్రమాదభరితమే. ప్రధాన పంట కాలువకు రక్షణగోడ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని స్థానికులు చెప్పారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో కనీసం వీధిలైట్లు కూడా

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్‌టీసీ బస్
- నలుగురు అక్కడికక్కడే మృతి
- మరో ఆరుగురికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- ధాన్యం లోడ్ చేస్తుండగా ఘటన
- ఉడిమూడి వద్ద ప్రమాదం
- రెండు గ్రామాల్లో తీవ్ర విషాదం
- న్యాయం చేయాలని ధర్నా

లేవు. సెల్ ఫోన్ల లైట్ల వెలుగులో పోలీసులు మృతదేహాలను గుర్తించి వివరాలు నమోదు చేయాల్సి వచ్చింది. అందరితో కలుపుగోలుగా ఉండే వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కలచివేసింది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యప్రకాష్,ఈరి కట్టయ్య, ఆదిమూలవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబీకులు రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహాలతో మృతుల కుటుంబీకులు, స్థానికులు ధర్నాకు దిగారు.ఒక్కొక్కరికీ రూ.10లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో రావాలని నినాదాలు చేశారు.న్యాయం చేసే వరకు మృతదేహాలను తరలించ మంటూ భీష్మించారు.ఆర్డీవో వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద స్థలికి కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ,సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ బి.శివకృష్ణ చేరు కుని మృతుల వివరాలు సేకరించారు.ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవరు సంఘటనాస్థలానికి రావాలంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు.మృతదేహాలను జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కూటమి శ్రేణులు పరిశీలించారు.రోడ్డు ప్రమాద మృతుల కుటుం బీకులు ఒక్కొక్కరికీ రూ.లక్ష వంతున సాయం అందిస్తానని పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ప్రకటించారు. కూటమి శ్రేణులు శిరిగినీడి వెంకటేశ్వరరావు,సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు, రుద్రరాజు వీరభద్రరాజు, అరిగెల సూరిబాబుతో పాటు పలువురు ప్రమాద స్థలికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మృతుల కుటుంబీకుల రోదన



మణిబాబు కట్టయ్య సూర్యప్రకాష్

3 గంటలైనా వదలని ఓటరు

- జిల్లా వ్యాప్తంగా పోటెత్తిన ఓటరు
- ఎక్కడికక్కడ కదలని క్యూలు
- అయినా అర్ధరాత్రి వరకూ ఓటు



ఓటరులో నిశ్శబ్ద అంతర్మథనం.. మూడు గంటలు లైన్‌లో నిలుచున్నా చలించని పట్టుదల.. ఈసారి పాలకులను ఎన్నుకునే అవకాశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పొరబాటు జరగకూడదన్న తపన.. భూమి కంపించినా 'మార్పు' కనిపించాలనే కసి పోలింగ్ వేళ ఓటరులో స్పష్టంగా ప్రస్ఫుటమైంది. ఏదేమైనా ఓటు వేసి తీరాల్సిందేననే తపన ఆ కళ్లల్లో కనిపించింది. టెంటు నీడ లేకపోయినా 40 డిగ్రీల ఎండను సైతం లెక్కపెట్టలేదు.. భారీ క్యూలైన్లు చూసి భయపడలేదు. తాగునీరు లేక నోరు తడారిపోయినా చంకలో చంటిబిడ్డతో ఓపిగ్గా ఓటు కోసం ఎదురు చూశారు. కొందరు గొడుగు వేసుకొని, కొంగు నీడలో అలాగే నిలబడ్డారు. క్యూలైను ఎంత నెమ్మదిగా కదిలినా కంగారు పడలేదు. ఆకలి కేకలు వేసినా వెనకడుగు వేయలేదు. 85ఏళ్ల వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్నా, మంచం పట్టినా కూడదీసుకొని పోలింగ్ స్టేషన్లకు తరలి వచ్చారు. రాత్రి 12 గంటలవుతున్నా కదల్లేదు.. ఓటు వేస్తూనే ఉన్నారు. తెలంగాణ, ఢిల్లీ, విదేశాల్లో.. ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లు, ఉపాధి కోసం వెళ్లిన వాళ్లు లక్షల రూపాయలు ఖర్చును కూడా లెక్కచేయకుండా ఈసారి ఓటు వేసితీరాల్సిందే అనే సంకల్పంతో వచ్చి వాలిపోయారు. సాధారణంగా ఆయా పార్టీల వారు వాహనాలను ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తరలిస్తుంటారు. కానీ, ఈసారి మాత్రం తండోపతండాలుగా స్వచ్ఛందంగా, ఓ ఉద్యమం మాదిరిగా.. జాతర చందంగా ఓటర్లు పోటెత్తారు. ఈ తీరు చూస్తే ఏదో ఆవేదన వీళ్లను బ్యాలెట్ వరకూ పంపించిందనక తప్పదు. ఐదేళ్లలో నిరాశ, నిశిరాత్రిలో కూరుకుపోయిన మన రాష్ట్రాన్ని బయటకు తీసుకురావాలనే తపన, పిల్లలకు మళ్లీ మంచి భవిత చూపించాలనే తలంపు, ప్రజాస్వామ్యానికి ఊపిరిపోయాలన్న ఆరాటం ఓటరుకు ఓపికనిచ్చినట్లు పోలింగ్ సరళి రుజువు చేసింది. మొత్తానికి తన కర్తవ్యం నెరవేర్చిన ఓటరు.. జూన్ 4 కోసం ఎదురు చూస్తున్నాడు ఆశగా..! - రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



అభ్యర్థులు జాతకాలు ఇక్కడే : నన్నయ వర్సిటీలో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లు..

అ టెన్షన్

జూన్ 4న తేలనున్న భవితవ్యం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఓటరు సునామీలా వచ్చి తీర్పు ఇచ్చేశాడు.. ఒకటా రెండా ఎన్నడూ లేనిది 80 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక అభ్యర్థులందరిలోనూ టెన్షన్ ఆరంభమైంది. ఈవీఎంలలో వారి జాత కాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఎవరి ధీమా వారిదే. టీడీపీ,జనసేన, బీజేపీ వర్గాల్లో భలే జోష్ కనిపిస్తోంది. వైసీపీ వర్గాలు ఏదో నిరుత్సాహంగా ఉన్నాయి. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఓట్లు రావని తెలిసిన స్వతంత్ర అభ్యర్థులు పొరపాటున తమకు ఓట్లేసి ఉంటారేమో అనే ధీమాతో కూడా ఉండడం గమనార్హం. ఎవరికి ఏ ధీమా ఉన్నా అందరికీ టెన్షన్ ఉంది.జూన్ 4వ తేదీ వరకూ టెన్షన్ తప్పదు.ఏకంగా 20 రోజులు ఓటరు తీర్పు కోసం అభ్యర్థులు వేచిచూడాల్సిందే. కూటమి వర్గాలు మాత్రం జిల్లాలో క్లీన్ స్వీప్ చేస్తామని

- జిల్లాలో 83 మంది పోటీ
- ఈవీఎంలలో అభ్యర్థుల జాతకాలు
- స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం
- ఎవరి ధీమా వారిది.. కూటమిలో జోష్
- వైసీపీలో కనిపించని ఉత్సాహం
- బెట్టింగ్‌లకు వెనుకడుగు

చెప్పుకుంటూ సంబరపడుతున్నాయి.జిల్లాలో ఒక పార్లమెంట్, 7 నియోజకవర్గాల్లో మొత్తం 83 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న సంగతి తెలిసిందే. వీటిలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత వంటి ముఖ్యనేతలు తమ భవిష్యత్ పరీక్షించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకత సునామీగా మారినట్టు చెబుతున్నారు.దీంతో కూటమిలో గెలుపు ధీమా కనిపిస్తోంది. రాజమండ్రి లోక్‌సభ కూటమి బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కొన్ని చోట్ల క్రాస్ ఓటింగ్ జరిగినా ఆమెకు తిరుగులేని ఫలితాలు వచ్చాయనే వాదన ఉంది. ఇక కూటమి టీడీపీ అభ్యర్థులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి (రాజమండ్రి రూరల్), ఆదిరెడ్డి వాసు (రాజమండ్రి సిటీ), ముప్పిడి వేంకటేశ్వరరావు (కొవ్వూరు), మద్దిపాటి వెంకట్రాజు (గోపాలపురం), జనసేన అభ్యర్థులు కందుల దుర్గేష్ (నిడదవోలు), బత్తుల బలరామకృష్ణ (రాజానగరం), బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (అనపర్తి) గెలుపు ధీమాలో ఉన్నారు. తమదే విజయమని తమ శ్రేణులతో సంబరాలు చేసుకుంటున్నారు. ఎన్నికల ముందు వరకూ బెట్టింగ్‌లకు సవాల్ విసి రిన వైసీపీ మద్దతు దారులు వెనకడుగు వేస్తున్నా రు. వైసీపీ నుంచి రాజమండ్రి సిటీ అభ్యర్థిగా మార్గాని భరత్, రూరల్ నుంచి చెల్లుబోయిన వేణు, రాజానగరం నుంచి జక్కంపూడి రాజా, అన పర్తి నుంచి డా.కె.సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరు నుంచి తలారి వెంకట్రావు, నిడదవోలు నుంచి జి. శ్రీనివాసనాయుడు, గోపాలపురం నుంచి తానేటి వనిత పోటీ పడిన సంగతి తెలిసిందే. వారి ధీమా వారికి ఉన్నప్పటికీ వారి అనుచరులు, పార్టీ శ్రేణు ల్లో మాత్రం నమ్మకం లేదు. గోదావరి జిల్లాలో వైసీపీ నేతలు సుమారు 6 సీట్ల మీద బొటాబొటీ నమ్మకం పెట్టుకోవడం మినహా, ఎవరిలోనూ ధీమా లేదు. కూటమి శ్రేణులు, నేతల్లో ఐక్యత కనిపిస్తే ఒంటరిగా పోటీ చేసిన వైసీపీలో గ్రూపులు, వెన్నుపోట్లు కూడా కనిపించాయి.

3,09,504 మంది ఓటర్లు గైర్హాజర్

జిల్లాలో మహిళా ఓట్లు ఎక్కువ. కానీ ఓటేసింది మాత్రం పురుషులే.జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా 13,13,645 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 80.93 శాతం.మొత్తం జిల్లాలో 3,09,504 మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు.జిల్లా ఓటర్లలో పురుషులు 7,92,317 మంది ఉండగా 6,66,133 మంది ఓటేశారు.1,44,543 మంది ఓటు వినియోగించుకోలేదు. జిల్లాలో మహిళా ఓటర్లు 8,30,735 మంది ఉండగా 6,66, 113 మంది ఓటేశారు.మహిళల్లో 1,64,622 మంది ఓటు హక్కు వినియోగించు కోలేదు. కొత్త ఓటర్లు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.మొత్తం జిల్లాలో 3,09,504 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు.ఈ సారి సుదూర ప్రాంతాల ఓటర్లు కసిగా వచ్చి ఓటేయడంతో 2019 ఎన్నికల కంటే ఓటర్ల సంఖ్య పెరిగింది.

80.93 శాతం పోలింగ్

జిల్లాలో ఓట్ల పోలింగ్ శాతం ఫైనల్ వివరాలను మంగళవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత ప్రకటించారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రకటించిన దానికంటే స్వల్పంగా శాతం పెరిగింది. మొత్తం జిల్లాలో 80.93 శాతంగా పోలింగ్ నమోదైంది. రాజానగరం నియోజకవర్గంలో అత్యధికంగా 87.53 శాతం నమోదు కాగా అత్యల్పంగా రాజమండ్రి సిటీలో 67.57 శాతం నమోదైంది. గోపాలపురంలో 86.67 శాతం, అనపర్తిలో 86.23 శాతం, కొవ్వూరులో 85.90 శాతం, నిడదవోలులో 84.67 శాతం,రాజమండ్రి రూరల్‌లో 73.02 శాతం పోలింగ్ నమోదైంది.

అర్ధరాత్రి 12 గంటలకు పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అనపర్తి	2,26,053	1,94,924	86.23
గోపాలపురం	2,42,763	2,10,399	86.67
కొవ్వూరు	1,84,136	1,58,176	85.90
నిడదవోలు	2,13,396	1,80,688	84.67
రాజమండ్రి సిటీ	2,67,484	1,80,733	67.57
రాజమండ్రిరూరల్	2,72,826	1,99,220	73.02
రాజానగరం	2,16,491	1,89,505	87.53
తూర్పుగోదావరి	16,23,149	13,13,645	80.93



స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరచి సీల్ వేసిన పార్లమెంట్ పరిశీలకుడు సుబ్రహ్మణ్యం, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత, ఆర్డీవో చైత్ర వర్షిణి

ఓటరు తీర్పు భద్రం..

దివాన్‌చెరువు/ రాజానగరం, మే14 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని.. ఈవీఎంలను కేంద్ర బలగాల రక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి కె.మాధవీలత తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈస్ట్రన్‌బ్లాక్ 2వ అంతస్తులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలను మంగళవారం ఉదయం రాజమండ్రి పార్లమెంట్, అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కే. బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో స్క్రూటినీ అనంతరం భద్రపరచి గదులకు సీల్ వేశామన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో పోలైన ఓట్లను అనుసరించి ఈవీఎం లలో పోలైన ఓట్లు ఫారం17ఎ రిజిస్టర్, పీవో డైరీ17 సి అనుసరించి స్క్రూటినీ చేశారు. రికార్డుల నిర్వహణ, ఈవీఎం యూనిట్స్‌లో పోలైన ఓట్లసంఖ్య రాజకీయపార్టీల, అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నన్నయ వర్సిటీలో ఏర్పాటు చేసిన 14 గదుల బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు జూన్ 4వ తేదీ వరకూ భద్రంగా ఉంటాయి. పీవో, ఏపీవోలకు ఇతర జిల్లాల్లో రూ.2 వేలు, రూ. 1050 ఇస్తే.. జిల్లాలో మాత్రం పీవో, ఏపీవోలకు రూ.1400, రూ.750 ఇవ్వడం ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. ఈ మేరకు ప్రత్యేక బలగాలు నిఘా ఉంచాయి. ఈ ప్రక్రియలో రాజానగరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఏ.చైత్రవర్షిణి, రాజమండ్రి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత బలగాలు

ఇక వెళ్లొస్తాం..



- ఓటర్లు తిరుగు ప్రయాణం
- రైళ్లలో కిక్కిరిసిన జనం
- రంగంలోకి రైల్వే రక్షక దళం
- వేరే రైళ్లలో సర్దుబాబు
- 600 మంది ప్రయాణికుల దించివేత
- టిక్కెట్ లేకపోవడమే కారణం

రాజమహేంద్రవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటు వేసి తిరుగు ప్రయాణమైన వారు రైళ్లల్లో పోటెత్తారు. దీంతో రాజ మండ్రి రైల్వే స్టేషన్ జాతరను తలపించింది. రైల్వే స్టేష ను జనంతో నిండిపోయింది. రిజర్వేషనుతో సహా అన్ని బోగీలు కిక్కిరిసిపోయాయి. కనీసం కాలు కదపడానికీ వీలు లేకుండా పోయింది. రిజర్వేషనులో 80, సాధారణ బోగీలో 90 సీట్లు ఉండగా రెండిటికీ తేడా లేకుండా ప్రతి బోగీలో సుమారు 300-400 మంది అతికష్టంపై ప్రయాణిస్తున్నారు. ఒక కూపేలో 8 మంది ప్రయాణించడానికి వీలుండగా 20 మందికిపైగా ఉంటున్నారు. బోగీల తలుపుల వద్ద ప్రయాణికులు వేలా డుతూ కనిపించారు.ఓట్ల పండుగకు తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన ఓటర్లు సోమ, మం గళవారం తిరుగు ప్రయాణమయ్యారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వైపు వెళ్లే రైళ్లలో మరీ దారుణమైన పరిస్థితి ఉంది. పిల్లలు, మహిళలు, వృద్ధులు నలిగిపోతున్నారు. రాజమండ్రి గుండా 120కిపైగా రోజువారీ, వారాంతపు రైళ్లు ప్రయా ణిస్తుంటాయి. వీటికితోడు ప్రత్యేక రైళ్లను వేశారు. ఇప్పటికే ఉన్న రైళ్లకు అదనపు బోగీలను తగిలించారు. అయినా అన్ని రైళ్లూ నిండు కుండల్లా రాకపోకలు సాగిస్తున్నాయి. మూడు రోజుల సెలవులు సోమవారం (పోలింగ్)తో ముగిశాయి. మంగళవారం నుంచి విధులకు హాజరు కావాల్సి ఉంది. దీంతో పెద్ద సంఖ్యలో జిల్లా నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఇటు కోనసీమ, అటు ఏజెన్సీ ప్రాంతాలకు రాజమండ్రి రైలు ప్రయాణ గేట్‌వే వంటిది. ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు నేరుగా రైలు సదుపాయం ఉండడంతో సాధారణ రోజుల్లో 10 వేల వరకూ.. ప్రత్యేక దినాల్లో 20 వేల మంది వరకూ రాకపోకలు సాగిస్తుంటారు.ఇప్పుడు ఆ సంఖ్య 30 వేల వరకూ ఉన్నట్లు కనిపిస్తోంది. మరో మూడు నాలుగు రోజులు ఇలాగే ఉండే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు. రద్దీ విపరీతంగా ఉండడంతో స్థానిక రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.ప్రయాణికుల భద్రత దృష్ట్యా పోస్ట్ కమాండర్ సైదయ్య నేతృత్వంలో రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) సిబ్బంది రంగంలోకి దిగారు.ప్లాట్‌ఫాంలు, బోగీల్లో తనిఖీలు చేపట్టడంతో పాటు ప్లాట్‌ఫాంలపై, బోగీల్లోని ప్రయాణికులకు సాధ్యమైన సహాయం చేస్తున్నారు. విపరీతమైన రద్దీగా ఉన్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌తో సహా 10 రైళ్లను నిలిపివేసి కొందరు ప్రయాణికులను వేరే రైళ్లలోకి సర్దుబాటు చేశారు. డిబ్రూగడ్-కన్యాకుమారి,



ప్రయాణికుల రద్దీ


విశాఖ-హైదరాబాద్(గోదావరి), కాకినాడ-లింగంపల్లి(గౌతమి), స్పెషల్ రైలు(06563)లోని సుమారు 600 మంది టికెట్టు లేని ప్రయాణికులను దించేశారు. హైదరాబాద్-విజయవాడ, రాజమండ్రి, విశాఖకు వారం రోజులపాటు అయినా ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.రద్దీ దృష్ట్యా రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పలు రైళ్లకు అదనపు బోగీలు వేశారు. అయితే వీటిపై సరైన ప్రచారం లేకపోవడంతో అక్కరకు రావడం లేదు. తమకు తెలిసిన రైళ్లనే ప్రయాణికులు ఆశ్రయిస్తుండడంతో సమస్య ఏర్పడుతోంది. ప్రయాణికులు కిక్కిరిసిపోవడంపై రైలు మదద్‌కి విపరీతంగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. రద్దీ సమయంలో రైళ్ల గురించి పబ్లిక్ అనౌన్స్‌మెంట్ ద్వారా పదే పదే చెబుతూ ఉంటే సాధారణ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

పిఠాపురం ఎటు వైపో?



86.63%

ఓట్ల శాతం తీరం దాటింది





యువ ఓటర్ల ఉత్సాహం

పిఠాపురం నియోజకవర్గంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన కొత్త ఓటర్లు



పిఠాపురం, మే 14: పిఠాపురంలో రికార్డుస్థాయి పోలింగ్ నమోదయింది. అసెంబ్లీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 86.63 శాతం నమోదైన ఈ ఓటింగ్ ఎవరికి వరంగా మారుతుందో అన్న చర్చ జోరుగా సాగుతోంది. వార్ వన్‌సైడ్ అవ్వడం వలనే ఇంత ఓటింగ్ జరిగిందని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఓటింగ్‌లో యువ, మహిళా ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో భారీ పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి రాత్రి 11గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవడం ఇందుకు అద్దం పట్టింది. ఎండ తీవ్రతను లెక్కచేయకుండా యువతీ యువకులు, మహిళలు, వృద్ధులు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంపై ఓటింగ్‌పై ప్రభావం చూపించింది.

పిఠాపురం నియోజకవర్గంలో ఓట్ల ప్రవాహం

నియోజకవర్గం చరిత్రలోనే తొలిసారి అత్యధిక శాతం నమోదు

నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,18,183 ఉండగా మహిళలు 1,18,223 మంది, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఉన్నారు. ఇందులో 2,04,811 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా, ఇందులో 1,03,370 మంది పురుషులు, 1,01,438 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 86.63గా నమోదయింది. 2019 అసెంబ్లీ ఎన్నికల కంటే ఇది 5.62 శాతం అధికం. ఆ ఎన్నికల్లో 81.01 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,71,234 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోగా పురుషులు 83,441 మంది ఉండగా, మహిళలు 87,791 మంది ఉన్నారు. 2014లో 79.44 శాతం మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పెరిగిన ఓటు దేనికి సంకేతం?

అసెంబ్లీ ఏర్పడిన తర్వాత ఇదే అత్యధిక ఓటింగ్ శాతం. రికార్డుస్థాయి పోలింగ్ నమోదు కావడంతో పెరిగిన ఓటింగ్ దేనికి సంకేతమనే చర్చ జోరుగా సాగుతోంది. యువ ఓటర్లు అత్యధికంగా ఓటింగ్‌కు తరలిరావడం ఇందుకు కారణంగా చెబుతున్నారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేయడం, ప్రభుత్వంపై వ్యతిరేకత తదితర కారణాలతో యువత ఓటింగ్‌కు వచ్చేందుకు ఉత్సాహం చూపించారు. అదే విధంగా ఇతర ప్రాంతాల్లో వృత్తి, వ్యాపార, ఉద్యోగాల రీత్యా ఉంటున్న వారు ఓటింగ్‌కు తరలివచ్చారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే స్థానికంగా ఉంటున్నవారు కాకుండా హైదరాబాదు, బెంగళూరు, చెన్నై నగరాలతో పాటు ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక, ఒడిసా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలు నుంచి సుమారు 16-17వేల మంది వచ్చారు. వీరితో పాటు విదేశాల్లో ఉంటున్న మరో 500-600 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చారు. స్థానికంగా ఉండే ఓటర్లతో పాటు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న నియోజకవర్గ ఓటర్లు తరలిరావడమే కారణంగా భావిస్తున్నారు.

రాత్రి 11 గంటల వరకు..

గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా ఓటర్లు బారులు తీరి ఉండటంతో ఓటింగ్ ఆలస్యమైంది. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు విరవ, విరవాడ, చిత్రాడ, దుర్గాడ, చేబ్రోలు, తాటిపర్తి తదితర గ్రామాల్లో సాయంత్రం 6 గంటల సమయానికి ఈ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతి చోటా 100 నుంచి 200 మంది వరకూ ఓటర్లు క్యూలో ఉన్నారు. కత్తులగూడెం పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ పూర్తయ్యేసరికి రాత్రి 11 గంటలు దాటింది. ఇక్కడ క్యూలో దాదాపు 300 మంది ఓటర్లు ఉండిపోయారు.

పవన్‌పై ప్రేమ అంటున్న జనసేన శ్రేణులు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై పిఠాపురం నియోజకవర్గ ప్రజలు చూపించి ప్రేమ, ఆదరాభిమానాలకు ఈ ఓటింగ్ నిదర్శనమని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అందుకే రికార్డుస్థాయి ఓటింగ్ నమోదైందని, ఇది వార్ వన్‌సైడ్ అయిందనేందుకు నిదర్శనమని వారు పేర్కొంటున్నారు. పవన్‌కు ఓటు వేసేందుకు నియోజకవర్గంలో ఓటర్లు ఉండి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నవారంతా ఇక్కడకు తరలివచ్చారని వారు తెలిపారు. ఓటింగ్ మాదిరిగానే మెజార్టీ కూడా ఉంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు. పెరిగిన ఓటింగ్ వైసీపీలో కలవరాన్ని సృష్టిస్తున్నది. నేతలు ఎవ్వరు నోరు మెదిపేందుకు ఆసక్తి చూపడం లేదు.



పిఠాపురం కత్తుల గూడెంలో రాత్రి 10గంటలకు కూడా క్యూలోనే ఓటర్లు

పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం

పవన్ బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తారు

కాశీ తువ్వాలుపై కూడా వైసీపీ కుట్రలు

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, మే 14: 'పిఠాపురం నుంచి పోటీ చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఎంత మెజార్టీ ఇస్తారనేది ప్రజల నిర్ణయం. మాకు మాత్రం ప్రజలకు ఏమి చేస్తాం. ఎంత అభివృద్ధి చేస్తామనేదే ముఖ్యం' అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. శ్రామికులు స్వేదం తుడుచుకోవడానికి వాడే కాశీ తువ్వాలుపై కూడా వైసీపీ చేసిన కుట్రలు విఫలమయ్యాయని చెప్పారు. పవన్ జనసేన అధ్యక్షుడి హోదాలో రాష్ట్రవ్యాప్తంగా జనసేనతో పాటు కూటమి తరపున ప్రచారం నిర్వహించారని తెలిపారు. పిఠాపురానికి పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేని పరిస్థితుల్లో కమిటీలను ఏర్పాటు చేశారని, కమిటీ సభ్యులందరూ బాధ్యతతో ప్రచారం నిర్వహించి అన్ని విధాల సహకరించారని చెప్పారు. జనసైనికులు, వీరమహిళలు అహర్నిశలు శ్రమించారని తెలిపారు. పవన్ కోసం రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒడిసా తదితర రాష్ట్రాలు నుంచి ఎంతో మంది స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం నిర్వహించారన్నారు. పవన్‌ను నిలబెట్టుకోవడానికి, గెలిపించుకునేందుకు పిఠాపురం ప్రజలు పరితపించిన తీరు తమకు సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. వైసీపీ దుర్మార్గ పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా రాష్ట్ర వ్యాప్తంగా బయటకు వచ్చి ఓటు వేశారని తెలిపారు. పవన్ గెలుపు కోసం నిరంతరం శ్రమించిన నియోజకవర్గ జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, స్నేహితులు, మిత్రులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు నాగబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, మహేంద్రరెడ్డి, శంకరగౌడ్, గంటా స్వరూప, కడలి ఈశ్వరి, కడారి తమ్మయ్యనాయుడు, పిల్లా శివశంకర్, పిల్లా రమ్యజ్యోతి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, బీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై వీరేశ్వరస్వామి



ఐ.పోలవరం, మే 14: మురమళ్ల శ్రీభద్రకాళీవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. నాలుగో రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం విశేష అభిషేకం, చండీ హోమం, కళా హోమాలు, సాయంత్రం నంది వాహనంపై ఊరేగింపు, సదస్యం, సభాపూజ, పండిత సత్కారం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల వేద పండితులు పాల్గొన్నారు. ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆత్రేయపురంలో ఉద్రిక్తత

ఇరు రాజకీయ పార్టీల మధ్య ఘర్షణ

మోహరించిన పోలీసులు

వైసీపీ నేత సోషల్ మీడియాలో సవాల్ పోస్టు

వైసీపీ ఘర్షణలో గాయపడిన టీడీపీ కార్యకర్త

ఎస్ఐ చెవికి గాయం

ఆత్రేయపురం, మే 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరిగిన ఘర్షణ చిలికిచిలికి గాలివానై ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం ఆత్రేయపురంలోని నెం.27 పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ నేతలు వెళ్లడంతో అక్కడే ఉన్న టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు (గబ్బర్‌సింగ్) అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న వైసీపీ శ్రేణులు వెంకట్రాజుపై దాడికి పాల్పడ్డారు. ఆయన చొక్కా చిరిగి భుజానికి గాయమైంది. గొడవ సద్దుమణిగిందన్న తరుణంలో ఆత్రేయపురానికి చెందిన వైసీపీ నేత వేగేశ్న గోపిరాజు టీడీపీ నేతలకు సవాల్ విసురుతూ సోమవారం రాత్రి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్ కలకలం సృష్టించింది. వైసీపీ నేతల అరాచకాలతో విసిగి వేసారిన టీడీపీ శ్రేణులు మంగళవారం ఉదయం రావిచెట్టు సెంటరు వద్దకు వెళ్లారు. అదే సమయంలో వైసీపీ శ్రేణులు కూడా వచ్చాయి. అక్కడ ఇరు వర్గాల వారు కలబడగా కొందరు స్వల్పంగా గాయపడ్డారు. టీడీపీ కార్యకర్త ముదునూరి రామభద్రరాజును గాయపరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువస్తున్న తరుణంలో ఎస్ఐ చెవికి గాయమైంది. పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్టేషన్ వద్దకు చేరుకుని పరిస్థితికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోపక్క టీడీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆ పార్టీ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సలాది రామకృష్ణ, కప్పల సునీల్, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహారావు జరిగిన అన్యాయంపై పోలీసులను నిలదీశారు. సీఐ, ఎస్ఐలు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని డీఎస్పీ కేవీ రమణపై మండిపడ్డారు. అనంతరం డీఎస్పీ టీడీపీ నాయకులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు హుటాహుటిన ముదునూరి వెంకట్రాజు స్వగృహానికి చేరుకున్నారు. నాయకులతో సమావేశమై అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలపై చర్చించారు. రాష్ట్రంలోను, కొత్తపేట నియోజకవర్గంలోను ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని, అది ఓర్వలేకే కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు ఉసిగొల్పడం సిగ్గుచేటన్నారు. అనంతరం టీడీపీ శ్రేణుల తరపున లీగల్ సెల్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఆత్రేయపురంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. రిజర్వ్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



మోహరించిన పోలీసులు



గాయపడ్డ టీడీపీ కార్యకర్త

అమెరికా నుంచి ఓటేయడానికి వచ్చా..



అమలాపురం టౌన్, మే 14: రాకుర్తి వెంకటేష్ అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని జార్జ్ ఎంసన్ యూనివర్సిటీలో మాస్టర్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదువుతున్నాడు. ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించేవని ప్రగాఢంగా నమ్మిన అతను అమెరికా నుంచి ఓటేయడానికి వచ్చాడు. అమలాపురంలో ఓటే వేశాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు రాష్ట్రానికి రాజధాని నిర్మించి, పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న భావనతోనే సెలవు పెట్టి మరీ అమెరికా నుంచి వచ్చి ఓటేశానని చెప్పారు.

సత్యదేవుడి సేవకు ఛత్రముల బహూకరణ



ఛత్రములు బహూకరిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 14: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సేవకు ఉపయోగించే ఛత్రములను మంగళవారం ఒకదాత విరాళంగా సమర్పించారు. గుడివాడకు చెందిన అమ్మా కనస్ట్రక్షన్ అధినేత మాటూరి రంగనాథ్ వీటిని దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను పీఆర్వో అభినందించి వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు. ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలలో వినియోగించి నిరంతరం స్వామివారి సేవలకు ఉపయోగిస్తామని పీఆర్వో తెలిపారు.

కూటమి నేతలపై వైసీపీ శ్రేణుల దాడులు

వల్లూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లీలాకృష్ణ అరెస్ట్

రామచంద్రపురం కోర్టుకు హాజరు..విడుదల

కపిలేశ్వరపురం, మే 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరులో పోలింగ్ నేపథ్యంలో స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన వైసీపీ, కూటమి నేతల మధ్య పరస్పర దాడులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణపై వైసీపీ వర్గీయులు తప్పుడు హత్యాయత్నం కేసు బనాయించారనే ఆరోపణలు పరిస్థితిని మరింత వేడెక్కించాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వల్లూరులో సోమవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, అంగర ఎస్ఐ ఎ.పరదేశి అక్కడకు చేరుకుని నాయకులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఆయన తనయుడు పృథ్వీరాజ్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడంతో దెబ్బతింది. దీంతో అదే గ్రామానికి చెందిన ఒకరిపై మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు వైసీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి నేతలపై వైసీపీ నేతలు దాడి చేసి అక్రమ కేసులు బనాయించడంతో లీలాకృష్ణను వల్లూరులో ఆయన స్వగృహంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు అక్రమ అరెస్ట్ చేసి భారీ బందోబస్తు నడుమ ఆయనను కె.గంగవరం మండలం పామర్రు పోలీస్ స్టేషన్‌కు అక్కడ నుంచి మండపేట సీఐ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, పార్టీ శ్రేణులు అక్కడకు చేరుకున్నాయి. అక్కడ నుంచి ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి వైద్య పరీక్షల అనంతరం ఆయనను మండపేట సీఐ కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి ఆయనను రామచంద్రపురం కోర్టులో జడ్జి ముందు హాజరుపర్చగా వాదనలు విన్న అనంతరం జడ్జి లీలాకృష్ణకు బెయిల్ మంజూరు చేయగా ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతరం లీలాకృష్ణ మాట్లాడుతూ తనను అన్యాయంగా కేసులో ఇరికించి కుట్ర రాజకీయాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆయన వెంట రామచంద్రపురం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు వరప్రకాష్ ఉన్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.



రామచంద్రపురం కోర్టు నుంచి విడుదలైన లీలాకృష్ణ

తప్పుడు కేసులు బనాయించారు

రామచంద్రపురం, మే 14: తనపై పోలీసు అధికారుల సహకారంతో హత్యాయత్నం కేసులు బనాయించారని మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆరోపించారు. మంగళవారం రామచంద్రపురం కోర్టు నుంచి బెయిల్‌పై విడుదల అయిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వల్లూరులో ఉద్దేశపూర్వకంగానే గొడవ పెట్టుకున్నారని ఆరోపించారు. పోలీసు అధికారుల సహకారంతో తమపై కేసు పెట్టారన్నారు. కోర్టులో వాస్తవాలు వివరించడంతో బెయిల్ మంజూరయ్యిందన్నారు. డీఎస్పీ, సీఐల సహకారంతోనే తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

లీలాకృష్ణ అరెస్టు అమానుషం

జనసేనాని పవన్‌కల్యాణ్ ఖండన

మండపేట, మే 14: జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణను పోలీసులు అరెస్టు చేయడాన్ని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఖండించారు. ఈమేరకు జనసేన కేంద్ర కార్యాలయం నుంచి పవన్‌కల్యాణ్ పేరిట లేఖను విడుదల చేశారు. వైసీపీకి చెందిన వారు జనసేన వారిపై కవ్వింపు చర్యలకు పాల్పడిన నేపథ్యంలో లీలాకృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంలో రాజకీయ కుట్ర దాగి ఉందని పవన్ పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై, అతడి అనుచరులపై కేసు నమోదు చేయకపోవటాన్ని పవన్ తప్పు పట్టారు. లీలాకృష్ణ అరెస్టు అన్యాయమని పవన్ అన్నారు. లీలాకృష్ణకు జనసైనికులు, పార్టీ అండగా ఉంటుందన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

మహిళ మృతి..మరో ఇద్దరికి గాయాలు



చింతూరు, మే 14 : అదుపు తప్పిన కారు చెట్టుకు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందారు. కృష్ణా జిల్లా గంపలగూడెంకు చెందిన ఒక కుటుంబం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వచ్చారు. అనంతరం మంగళవారం తిరిగి వారి ప్రాంతానికి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో చింతూరు మండలం, కాటుకపల్లి సమీపంలో అదుపుతప్పిన కారు రహదారిని ఆనుకొని ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి (46) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు మహిళలకు, కారు డ్రైవర్‌కు, ఒక బాలుడికి కూడా గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. చింతూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యర్థులపై కత్తితో దాడి

చిన్నారికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్ప గాయాలు

అమలాపురం టౌన్, మే 14: సరిహద్దు తగాదాల నేపథ్యంలో గతంలో తన భార్యను హత్య చేసిన కేసులో ప్రతికారం తీర్చుకునేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. ప్రత్యర్థి వర్గంపై మంగళవారం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కత్తితో చేసిన ఈ దాడిలో ఓ చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2021 మే 14న అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లో డీఎస్పీ కార్యాలయానికి సమీపంలో తల్లీకొడుకులపై జరిగిన దాడిలో తల్లి కోండ్రు దుర్గ(45) అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు రమేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. మినీ వ్యాన్‌లో మారణాయుధాలతో వచ్చిన మంగం బాలయోగి కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా ఈ హత్యకు పాల్పడినట్టు అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదు చేశారు.

సరిగ్గా నేడు అదే రోజున..

ప్రత్యర్థి వర్గంపై పగతో రగలిపోతున్న హత్యకు గురైన దుర్గ భర్త కోటేశ్వరరావు పక్కా ప్రణాళికలతో సిద్ధమయ్యి మంగళవారం దాడి చేశాడు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ అందించిన వివరాలు ప్రకారం... దుర్గ హత్య కేసులో వాయిదా నిమిత్తం మంగం బాలయోగి కుటుంబ సభ్యులు కోర్టుకు హాజరయ్యారు. వారు కోర్టుకు వస్తున్నారన్న సమాచారంతో ఆటో డ్రైవర్ అయిన కోటేశ్వరరావు పక్కా ప్రణాళికతో అమలాపురం వచ్చాడు. కోర్టు నుంచి తిరిగి వెళ్తుండగా బాలయోగి భార్య మంగ అనారోగ్యంతో బాధపడుతుండడంతో గనికమ్మ వీధిలో తాయత్తు తెచ్చుకునేందుకు వెళ్లాడు. ఈ లోపున బాలయోగి మనుమరాలైన గుణశ్రీని తీసుకుని బాలయోగి కుమారుడు విజయ్ మెయిన్‌రోడ్డులో నడిచి వెళ్తుండగా ఆటోలో వచ్చిన కోటేశ్వరరావు మాటువేసి ఒక్కసారిగా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కత్తితో చేసిన దాడిలో గుణశ్రీ తలకు తీవ్ర గాయమైంది. విజయ్‌కు స్వల్ప గాయమైంది. మెయిన్‌రోడ్డులో ఈ సంఘటన జరగడంతో స్థానికులు ఒక్కసారిగా కోటేశ్వరరావును చుట్టుముట్టి దేహశుద్ధి చేశారు. గాయపడ్డ గుణశ్రీని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కోటేశ్వరరావును ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ క్రిస్టఫర్ తెలిపారు. అదే విధంగా కోటేశ్వరరావుపై జరిగిన దాడి ఘటనపై వారి కుటుంబ సభ్యుడు బాలయోగి తదితరులపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా మెయిన్‌రోడ్డులోని చైతన్య టెక్నో స్కూలు ఎదురుగా జరిగిన దాడి సమాచారం తెలుసుకున్న డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని పోలీసు వాహనంలోనే ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. మానవత్వం చాటుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఎస్.శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.



చికిత్స పొందుతున్న గుణశ్రీ

స్థానికుల దేహశుద్ధితో పడిఉన్న కోటేశ్వరరావు

ఓట్ల వరద



రాజమహేంద్రవరంలో సోమవారం ఓటు వేసేందుకు లైన్లలో భారీగా వేచి ఉన్న ఓటర్లు

- 2019 ఎన్నికలతో పోల్చితే భారీగా పెరిగిన ఓటింగ్
- జిల్లాలో మొత్తం ఓటర్లు 16,23,149 మంది
- ఓటు హక్కు వినియోగించుకున్న వారు 12,89,298 మంది
- అత్యధికం రాజానగరం(86.16శాతం)
- అత్యల్పం రాజమహేంద్రవరం సిటీ (66.72శాతం)

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జనం కసిగా ఓటేశారు. బాధ్యత ఎరిగిన ఓటెత్తారు. గతంలో ఎన్నడూ కనిపించ నంత కసిఓటర్లలో కనిపించింది. తెలంగాణ, బెంగుళూరు, చెన్నై, వంటి ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి ఓటర్లు వరదగా గోదావరి పోటెత్తారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ సోమవారం ఐదుగంటల వరకూ పోలైన ఓటర్ల వివరాలివి. ప్రతీ రెండు గంటలకు పోలైన ఓట్ల వివరాలను అధికారులు ప్రకటించారు.

మొదటి రౌండ్‌లో రాజమహేంద్రవరం రూరల్‌లో 9.81శాతంగా ఎక్కువ ఓట్లు పోలవ్వగా, నిడదవోలు 5.84శాతం ఓట్లే పోలయ్యాయి. తర్వాత ఓటింగ్ శాతం బాగా పెరిగింది. క్రమక్రమంగా పుంజుకుని వరద గోదారిలా ఓటర్లు తరలి వచ్చి అర్ధరాత్రి వరకూ ఓట్లు వేశారు.

● అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 2,26,053 మంది ఓటర్లు ఉండగా, 1,94,924 మంది ఓటేశారు. ఉదయం 9గంటలకు 7.59శాతం ఓట్లు పోలయ్యాయి. 11గంటలకు 48,641మంది ఓటేశారు. ఇది 21.52శాతం, ఒంటి గంటకు 3.295శాతం, 3గంటలకు 53.76శాతం, 5గంటలకు 69.07శాతం ఓటు వేశారు. రాత్రి9గంటలకు 80.9శాతం, 12గంటలకు 86.23శాతం ఓట్లు పోలయ్యాయి.

● రాజానగరంలో మొత్తం ఓటర్లు 2,16,491 మంది ఉండగా 1,89,505 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 9గంటలకు 7.81శాతం, 11గంటలకు 22.91 శాతం, 1గంటకు 33.64శాతం, 3గంటలకు 54.16శాతం, 5గంటలకు 68.71శాతం ఓట్లు పోలయ్యాయి. రాత్రి 9గంటలకు 80.97 శాతం, 12గంటలకు 87.53శాతం ఓట్లు పోలయ్యాయి.

● రాజమహేంద్రవరం సిటీలో మొత్తం ఓటర్లు 2,67,484 మంది ఉండగా 1,80,733 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 9గంటలకు 8.58శాతం, 11గంటలకు 21.2శాతం, 1గంటకు 31.91శాతం, 3గంటలకు 47.13శాతం, 5గంటలకు 58.2శాతం. రాత్రి 9గంటలకు 65.95శాతం, 12గంటలకు 67.57శాతం ఓట్లు పోలయ్యాయి.

● రాజమహేంద్రవరం రూరల్‌లో మొత్తం ఓటర్లు 2,72,826 మంది ఉండగా 1,99,220 మంది ఓటేశారు. ఉదయం 9గంటలకు 9.81శాతం, 11గంటలకు 25.14శాతం, 1గంటకు 37.25శాతం, 3గంటలకు 53.92శాతం, 5గంటలకు 65.24శాతం ఓట్లు, రాత్రి 9గంటలకు 72.52శాతం, 12గంటలకు 73.02శాతం ఓట్లు పోలయ్యాయి.

● కొవ్వూరులో మొత్తం ఓటర్లు 1,84,136 మంది ఉండగా 1,58,176 మంది ఓట్లు వేశారు. ఉదయం 9గంటలకు 7.91శాతం, 11గంటలకు 23.10శాతం, 1గంటకు 34.21శాతం, 3గంటలకు 53.4శాతం, 5గంటలకు 69.27శాతం ఓటు పోలయ్యాయి. రాత్రి 9గంటలకు 81.34శాతం, 12గంటలకు 85.90శాతం ఓట్లు పోలయ్యాయి.

● నిడదవోలులో మొత్తం ఓటర్లు 2,13,396మంది ఉండగా 1,80,688 మంది ఓట్లు వేశారు. ఉదయం 9గంటలకు 5.84శాతం, 11గంటలకు 21.92శాతం, 1గంటకు 29.20శాతం, 3గంటలకు 52.99శాతం, 5గంటలకు 67.42శాతం ఓటు పోలయ్యాయి. రాత్రి 9గంటలకు 78.46శాతం, 12గంటలకు 84.67శాతం ఓట్లు పోలయ్యాయి.

● గోపాలపురంలో మొత్తం ఓటర్లు 2,42,763మంది ఓటర్లు ఉండగా 2,10,399 మంది ఓట్లు వేశారు. ఉదయం 9గంటలకు 8.72శాతం, 11గంటలకు 23.88శాతం, 1గంటకు 34.43శాతం, 3గంటలకు 56.24శాతం, 5గంటలకు 70.14శాతం ఓటు పోలయ్యాయి. రాత్రి 9గంటలకు 81.12శాతం, 12గంటలకు 86.67శాతం ఓట్లు పోలయ్యాయి.



పెరవలిలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు లైన్‌లో వేచి ఉన్న ఓటర్లు

అర్ధరాత్రి దాటేవరకు పోలింగ్

● రాజమహేంద్రవరం సిటీలో 67.57 శాతం ఓటింగ్

రాజమహేంద్రవరం సిటీ, మే 14 : రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి పోలింగ్ సోమవారం అర్ధరాత్రి దాటే వరకు సాగింది. నగరంలో 2,67,484 మంది ఓటర్లుకుగాను రాత్రి 11 గంటలకు జరిగిన పోలింగ్‌లో 1,78,456 మంది ఓట్లు వేశారు. సిదార్థనగర్, అన్నపూర్ణంపేట ప్రాంతాల్లోని మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు అర్ధరాత్రి దాటేవరకు ఓట్లు వేశారు. దీంతో 1,80,733 ఓట్లు పోలయ్యాయి. రాజమహేంద్రవరం సిటీ ఓటింగ్ శాతం 67,57కు చేరుకుంది. నగరంలో 87,192 మంది పురుషులు, 93,517 మంది మహిళలు, 24మంది ఇతరులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఏజెన్సీ సమాచారం

మన్యంలో పోలింగ్ శాతం తగ్గినా ఓట్లు పెరిగాయి

● వైసీపీ వ్యతిరేక ఓటును కొల్లగొట్టామంటున్న దేశం
● గతం కంటే మెజారిటీ పెంచుకున్నామంటున్న వైసీపీ

(రంపచోడవరం)

రంప మన్యం ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రధాన వైరిపక్షాలైన టీడీపీ, వైసీపీలు ఎవరికి వారు ఈసారి విజయం మాదేనంటూ ధీమాను వ్యక్తం చేస్తుంటే, ఇక్కడ పోలింగ్ శాతం తగ్గినా, గతం కంటే పోలైన ఓట్ల సంఖ్య పెరిగింది. రంపచోడవరం 11 మండలాలలో 2,77,319 మంది ఓటర్లు ఉండగా సోమవారం జరిగిన పోలింగ్‌లో 2,08,025 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరికి అదనంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఈ నియోజకవర్గంలో 3,224 మంది ఓటు హక్కును వినియోగించుకున్న వారిని కలిపితే మొత్తంగా 2,11,249 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఇక్కడ పోలింగ్ శాతం 76.17 శాతంగా నమోదైంది. గత 2019 లెక్కలను చూస్తే 2,60,380 మంది ఓటర్లకు గానూ 2,03,660 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 78.22 శాతంగా పోలింగ్ నమోదైంది. ఇపుడైతే అప్పటికంటే 2 శాతం తగ్గి 76.17 శాతంగా నమోదైంది. కాగా పర్సంటేజీ తగ్గినా పోలైన ఓట్ల సంఖ్య గతం కంటే పెరిగింది. గతంలో 2,03,660 మంది ఓటు హక్కును వినియోగించుకుంటే, ఇపుడు ఆ సంఖ్య 2,11,249కి పెరిగింది. అంటే గతం కంటే ఎక్కువగా 7,589 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే ఇది గతం కంటే పోలైన ఓట్ల సంఖ్య 3.59 శాతం పెరిగింది. 16,939 మంది (6శాతం) కొత్త ఓటర్లు పెరిగినా, అదే స్థాయిలో పోలైన ఓట్ల సంఖ్య పెరగలేదు. గతంలో కంటే మహిళా ఓటర్లు దాదాపుగా 10 వేల మంది పెరిగినా, పోలింగ్‌లో పాల్గొన్న వారి సంఖ్య 3 వేలే పెరిగింది. పోలింగ్ జరిగిన తీరు అలా ఉంటే ఫలితాల విషయంలో తెలుగుదేశం అధిక ధీమాతో ఉంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు, ఐదు మండలాల్లో ఉన్న ఒక లక్ష వరకూ ఉన్న పోలవరం నిర్వాసితుల ఓట్లు, వైసీపీ నాయకుల బాధితుల ఓట్లు ఇలా అనేక అంశాలు తమకు అనుకూలంగా ఉన్నాయన్న ధీమా సర్వత్రా దేశం క్యాడర్ నుంచి వ్యక్తమవుతోంది. వైసీపీ కూడా ధీమాతోనే ఉంది. గతం కంటే తమకు ఓటింగ్ పర్సంటేజీ పెరుగుతోందని, విజయం తమకు సునాయాసమని లెక్కలు కడుతోంది.

భద్రంగా అభ్యర్థుల భవితవ్యం

● స్ట్రాంగ్‌రూమ్‌కు చేరిన అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థుల 798ఈవీఎంలు



రంపచోడవరంలో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేస్తున్న అధికారులు

రంపచోడవరం, మే 14: రంపచోడవరం గిరిజన నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ, అరకు పార్లమెంటు అభ్యర్థుల భవితవ్యం రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్‌లోకి భద్రంగా చేరింది. రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అసెంబ్లీకి 399 ఈవీఎంలు, పార్లమెంటుకు 399 ఈవీఎంలు సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకూ చేరుకున్నాయి. ఆయా అభ్యర్థులకు సంబంధించి ప్రధాన ఏజెంట్ల సమక్షంలో ఎన్నికల పరిశీలకుడు పంకజ్‌సింగ్ పర్యవేక్షణలో ప్రతీ పోలింగ్ కేంద్రానికి సంబంధించి ఈవీఎంలను వరుసగా వాటికి కేటాయించిన స్థానాల్లో ఉంచారు. జూన్ 4 వరకూ ఈ ఈవీఎంలను రంపచోడవరంలోని గురుకుల విద్యాలయాల ప్రాంగణంలో ఈ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చుతున్నారు. అనునిత్యం స్ట్రాంగ్‌రూమ్ సీఆర్‌పీఎఫ్ బలగాల భద్రతలోనే ఉంటుందని రిటర్నింగ్ అధికారి ప్రశాంతకుమార్ తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై హర్షం



మాట్లాడుతున్న ఆర్వో ప్రశాంతికుమార్

రంపచోడవరం, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో బాధ్యతాయుతంగా విధులు చేపట్టిన ఎన్నికల అధికారులు, సిబ్బందికి రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్ కుమార్ అభినందనలు తెలిపారు. మంగళవారం ఆయన ఎన్నికల పరిశీలకుడు పంకజ్‌సింగ్ కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్టమైన భద్రతతో ఎన్నికలు నిర్వహించామన్నారు. నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలలో 2,77,317 ఓటర్లకు గాను 2,08,025 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. 75.01శాతం పోలింగ్ నమోదైనట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌వో చిట్టిబాబు, డీఎల్‌పీవో రఘునందన్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌రావు పాల్గొన్నారు.

డొంకరాయి పరిసర ప్రాంతాల్లో పుష్ప-2 షూటింగ్



ఎర్రచందనం తరలిస్తున్న దృశ్యాలు

మోతుగూడెం, మే 14: వై.రామవరం మండలం బొడ్డగండి, డొంకరాయి పరిసర ప్రాంతాల్లో పుష్ప-2 షూటింగ్ జోరుగా జరుగుతోంది. సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ 99 శాతం పూర్తవగా తాజాగా కొన్ని సన్నివేశాలను మంగంపాడు పాలగడ్డ, డొంకరాయి గ్రామాల్లో మూడు రోజులు పాటు చిత్రీకరించారు. అల్లు అర్జున్ బాల్యంలో తోటి కుర్రవాళ్లతో క్రికెట్ ఆడే సన్నివేశాలు, ఎర్రచందనం లారీలో తరలిస్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. బుధవారం నుంచి మోతుగూడెం పరిధిలో పొల్లూరు శివాలయం వద్ద సంత నిర్వహణ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. పొల్లూరులో అక్కడ దుకాణాలు పాకలను యూనిట్ బృందం సభ్యులు నిర్మిస్తున్నారు. ఈ షూటింగ్ రెండు రోజులు పాటు జరుగుతుందని తెలిపారు.

ఏకలవ్య పాఠశాలలో నూరుశాతం సీబీఎస్ఈ ఫలితాలు

వై.రామవరం, మే14: వై.రామవరం మండలం పి.యర్రగొండ గిరిజన సంక్షేమ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి, 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో నూరుశాతం ఫలితాలు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. పదో తరగతిలో 77 మంది హాజరవగా 77 మంది ఉత్తీర్ణులయ్యారని అలాగే 12వ తరగతిలో 82 మందికి 82 మంది ఉత్తీర్ణులై నూటికి నూరుశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.

వైభవంగా స్వామివారి వార్షికోత్సవం

కడియం, మే 14: కడియపులంక హరిహర క్షేత్రంగా బాసిల్లుతున్న హరిహర మహాక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి 7వ వార్షికోత్సవ వేడుకలు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకస్వామి శ్రీనివాసాచార్యులు మంత్రోచ్ఛారణల మధ్య శ్రీలక్ష్మీవేంకటేశ్వర హోమం, పంచామృతాభిషేకం, శ్రీవారి పాదసేవ, అగ్నిమథనం, అష్టోత్తర పూజ వంటి పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయంవద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ రైతులు, భక్తులు పాల్గొన్నారు.



కడియపులంక హరిహర క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

నన్నయ యూనివర్సిటీ ఈస్ట్రన్ బ్లాక్‌లో ఈవీఎంలు భద్రం



నన్నయ యూనివర్శిటీ ఈస్ట్రన్ బ్లాక్‌లో అనపర్తి నియోజకవర్గ ఈవీఎం బాక్సులకు సంబంధించి ఆర్వో మాధురితో కలిసి రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

అనపర్తి, మే 14: అనపర్తి నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో వినియోగించిన ఈవీఎంలను మంగళవారం రాజానగరంలోని నన్నయ్య యూనివర్శిటీ ఈస్ట్రన్ బ్లాకులో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచినట్లు ఆర్వో ఎం.మాధురి తెలిపారు. నియోజకవర్గంలోని 228 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్క్రూటినీ అనంతరం కేంద్ర బలగాల రక్షణలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎన్నికల రికార్డులను పరిశీలించినట్లు ఆమె తెలిపారు. పోలైన ఓట్లు అను సరించి ఈవీఎంలలో పోలైన ఓట్లు, పారం 17ఎ రిజిస్టర్, పీవో డైరీ 17సిని అనుసరించి స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించి నట్లు ఆమె తెలిపారు. దీనిపై రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సమక్షంలో స్రూటినీ నిర్వహించడంతో పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆమె తెలిపారు.

ఎన్నికల సరళిపై గిడుగు సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, మే 14 : రాజమహేంద్రవరం కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో మంగళవారం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు ఎన్నికల సరళిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది కార్యకర్తలని తనకు మద్దతుగా నిలిచి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బూత్ ఏజెంట్ల కృషి మరువలేనిది అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో గుర్తు ఉందని ఇకపై ప్రజా సమస్యలపై పోరాడి వారికి అండగా ఉండి వారికి నమ్మకాన్ని పొందాలన్నారు. ఈ సందర్భంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు రాజమహేంద్రవరం సిటీ నుంచి బోడా వెంకట్, రూరల్ నుంచి బాలేపల్లి మురళీధరరావు, రాజానగరం నుంచి ముంద్రు శ్రీనివాస్, అనపర్తి నుంచి శ్రీనివాసరావు, కొవ్వూరు అరిగెల అరుణకుమారి, నిడదవోలు పెద్దిరెడ్డి సుబ్బారావు, గోపాలపురం నుంచి మార్టిన్ లూథర్, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజాలు కలిపి గిడుగు రుద్రరాజు దంపతులను సత్కరించారు.

ఎస్ఈబీ దాడిలో వ్యక్తి అరెస్టు

దేవరపల్లి, మే 14: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామంలో దాడులు నిర్వహించినట్లు సీఐ కేవీ.స్వామి, తెలిపారు. ఈ సందర్భంగా 12మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఎస్ఐ సుధీర్, సిబ్బంది దాడిలో పాల్గొన్నారన్నారు.

అనపర్తిలో 20వేల మెజార్టీతో విజయం సాధిస్తా

● ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తి, మే 14: సోమవారం అనపర్తి నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో 20వేల మెజార్టీతో తాను విజయం సాధిస్తానని కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ ముగిసిన సందర్భంగా మంగళవారం రామవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా అభ్యర్థిత్వం గందరగోళంలో పడిన నాటి నుంచి పోలింగ్ ముగిసే వరకు సైనికుల్లా పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు రుణపడి ఉంటానని అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్న లక్ష్యంతో రాత్రి పది గంటల వరకు లైన్లలో నిలబడి ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 140 సీట్లతో ఎన్డీయే కూటమి అధికారం సాధిస్తుందని కేంద్రంలో మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేస్తారని నల్లమిల్లి అన్నారు.

నల్లమిల్లిని కలిసిన మహిళా నేతలు

అనపర్తి, మే 14: అనపర్తి మండలం రామవరంలో మంగళవారం ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని బీజేపీ మహిళామోర్చా జాతీయ కార్యదర్శి మాలతీరాణి, టీడీపీ తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి సాయి కళ్యాణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో నల్లమిల్లి భారీ మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు.



నల్లమిల్లిని కలిసిన బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యదర్శి మాలతీరాణి, టీడీపీ తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్యాణి

ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు అభినందనీయం



వృద్ధురాలిని వీల్ చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రాజానగరం, మే 14: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్‌సీసీ క్యాడెట్లు అందించిన సేవలు అభినందనీయమని సుబేదార్ భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వివేక్ సావన్‌గౌడర్ ఆదేశాల మేరకు గైట్ కళాశాలలోని 27 మంది ఎన్‌సీసీ క్యాడెట్లుతోపాటుగా 164 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లా ల్లో 13న జరిగిన ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సేవలందించడంలో ఉదయం నుంచి అర్ధరాత్రి పోలింగ్ ముగిసేవరకు విశేషసేవలందించి, పోలీసుల అభినందనలు అందుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో గైట్ ఎన్‌సీసీ ఏఎన్‌వో ఎ.తేజేశ్వర రాజు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో అగ్రగామిగా షిర్డిసాయి

రాజమహేంద్రవరంరూరల్, మే 14: సీబీఎస్ఈ 10వ తరగతి, 12 తరగతి ఫలితాల్లో షిర్డిసాయి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. 10వ తరగతిలో బీ వీ ఆర్ సాహితి 500 మార్కులకుగాను 484 మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, జే సుహాస్‌సాయి 479 మార్కులతో ద్వితీయ స్థానం, ఏ రేణుసాయిశ్రీ 478 మార్కులతో తృతీయ స్థానం పొందగా హాజరైన 82 మంది విద్యార్థులలో 22 మంది 90 శాతంపైగా మార్కులు సాధించగా, 63 మంది విద్యార్థులు 80శాతం పైగా మార్కులతో డిస్టింక్షన్‌తో ఉత్తీర్ణత సాధించినట్లు శ్రీవిద్య తెలిపారు. అలానే 12వ తరగతి విద్యార్థిని కె.శ్రీలాస్య 500 మార్కులకు 489 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, 485 మార్కులతో జి.శ్రీవిద్య ద్వితీయస్థానం, 481 మార్కులతో బి.లక్ష్మణనాయుడు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. 12వ తరగతిలో 300 మంది విద్యార్థులు హాజరుకాగా 45 మంది 90శాతం పైగా మార్కులు సాధించగా, 216 మంది 80శాతంపైగా మార్కులతో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారని శ్రీవిద్య వివరించారు. అధ్యాపక, ఉపాధ్యాయ బృందాన్ని షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ జేఎస్‌వీ ప్రసాదరెడ్డి, లక్ష్యా, దీక్ష్యా, డేప్నీ డీన్‌లు అభినందించారు.

వాసు కుటుంబానికి న్యాయం చేయాలి

● పేపరుమిల్లు వద్ద గిరజాల బాబుతో సహా గ్రామస్థుల ధర్నా





పేపరుమిల్లువద్ద ధర్నా నిర్వహిస్తున్న బాబు, కడియం వాసులు, ఇన్‌సెట్‌లో వాసు(ఫైల్)

కడియం, మే 14: కడియం పేపరుమిల్లులో కాంట్రాక్టు పద్దతిలో డ్రైవరుగా పనిచేస్తున్న కడియం గ్రామానికి చెందిన గోక వాసు(45) అనే వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలంటూ కడియం గ్రామానికి చెందిన బాధ్యత సేవాసంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.... కడియం గ్రామానికి చెందిన గోక వాసు (45) కడియం పేపరుమిల్లులో కాంటాక్టు పద్దతిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వాసు డ్యూటీకి వెళ్లాడు. పేపరుమిల్లు వద్ద నొప్పి రావడంతో పేపరుమిల్లు ద్వారా రాజమహేంద్రవరం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వాసు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దాంతో వాసు మృతదేహాన్ని కడియం తీసుకు వచ్చారు. విషయం తెలిసి పేపరుమిల్లు ప్రతినిధులతో గిరజాల బాబు మాట్లాడారు. పేపరుమిల్లు యాజమాన్యంతో మాట్లాడతామని ప్రతినిధులు చెప్పి వెళ్లిపోయారు. పేపరుమిల్లు యాజమాన్యం పట్టించుకోలేదంటూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బాధ్యతాసేవాసంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, గ్రామస్థులు పేపరుమిల్లుకు వెళ్లి శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. మృతుడు వాసు కుటుంబసభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. గిరజాల బాబు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆవరణలో చనిపోయిన వ్యక్తికి ఎటువంటి నష్టపరిహారం ఇవ్వడానికి మేనేజ్‌మెంట్ ముందుకు రాకపోవడం దారుణం అన్నారు. మేనేజ్‌మెంట్ తక్షణమే స్పందించి వాసు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మృతుడు వాసు భార్య, పిల్లలు, కడియం గ్రామానికిచెందిన పలువురు యువత, గ్రామస్థులు ఉన్నారు.

ఘనంగా వాసవీమాత జయంత్యోత్సవాలు





అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు, మజ్జిగ పంపిణీ చేస్తున్న యువ వైశ్య సభ్యులు

ధవళేశ్వరం, మే14: ధవళేశ్వరంలోని గోదావరి తీరాన ఉన్న శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారి జయంత్యోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదురోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి కుంకుమ పూజలు చేశారు. బుధవారం అమ్మవారికి సువాసీలచే కుంకుమ పూజలు, గురువారం విశేషపూజలు, శుక్రవారం పలు రకాల పుష్పాలతో పూజ, శనివారం ఉదయం విశేష అలంకరణలో దంపతులపూజలు, కన్యలతో పూజలు. అనంతరం సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతిరోజు సాయంత్రం ఆలయప్రాంగణంలో మహిళా సమాజం ఆధ్వర్యంలో లలిత సహస్రనామ పారాయణం, పేరంటం నిర్వహించి ప్రసాద వితరణ చేస్తారు. ఉత్సవాలు ఐదు రోజులు యువ వైశ్యసభ్యులు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయనున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

ఉండ్రాజవరం, మే 14: మండలంలోని తాడిపర్రు గ్రామంలో విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఆ ఒక్కటీ అడక్కు
సూర్యామినీ	: కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యాప్యాలస్	: ప్రతినిధి -2
స్వామి	: కృష్ణమ్మ
శివజ్యోతి	: గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ(సాయికృష్ణ)	: లక్ష్మీకటాక్షం
రాజా	: రత్నం
ఊర్వశి	: బాక్
రంభ	: కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
మేనక	: ప్రసన్నవదనం
అప్సర	: కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కుమారి	: రత్నం
వీఎస్ మహల్(నామవరం)	: కృష్ణమ్మ, ప్రతినిధి-2
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కృష్ణమ్మ
వెంకటసూర్య(కడియం)	: ఆ ఒక్కటీ అడక్కు
సత్యగౌరి (అనపర్తి)	: బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: బాక్
రామకృష్ణ(కోరుకొండ)	:
గీతాసినిమాస్ (సీతానగరం)	:
శ్రీనివాస (గోకవరం)	: కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహల్(రంపచోడవరం)	: ఆ ఒక్కటీ అడక్కు
నవయుగ(చింతూరు)	: ఆ ఒక్కటీ అడక్కు



కూలిన బతుకులు : ప్రమాదంలో మృతులు

3 గంటలైనా వదలని ఓటరు

- జిల్లా వ్యాప్తంగా పోటెత్తిన ఓటరు
- ఎక్కడికక్కడ కదలని క్యూలు
- అయినా అర్ధరాత్రి వరకూ ఓటు



ఓటరులో నిశ్శబ్ద అంతర్మథనం.. మూడు గంటలు లైన్‌లో నిలుచున్నా చలించని పట్టుదల.. ఈసారి పాలకులను ఎన్నుకునే అవకాశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పొరబాటు జరగకూడదన్న తపన.. భూమి కంపించినా 'మార్పు' కనిపించాలనే కసి పోలింగ్ వేళ ఓటరులో స్పష్టంగా ప్రస్ఫుటమైంది. ఏదేమైనా ఓటు వేసి తీరాల్సిందేననే తపన ఆ కళ్లల్లో కనిపించింది. టెంటు నీడ లేకపోయినా 40 డిగ్రీల ఎండను సైతం లెక్కపెట్టలేదు.. భారీ క్యూలైన్లు చూసి భయపడలేదు. తాగునీరు లేక నోరు తడారిపోయినా చంకలో చంటిబిడ్డతో ఓపిగ్గా ఓటు కోసం ఎదురు చూశారు. కొందరు గొడుగు వేసుకొని, కొంగు నీడలో అలాగే నిలబడ్డారు. క్యూలైను ఎంత నెమ్మదిగా కదిలినా కంగారు పడలేదు. ఆకలి కేకలు వేసినా వెనకడుగు వేయలేదు. 85ఏళ్ల వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్నా, మంచం పట్టినా కూడదీసుకొని పోలింగ్ స్టేషన్లకు తరలి వచ్చారు. రాత్రి 12 గంటలవుతున్నా కదల్లేదు.. ఓటు వేస్తూనే ఉన్నారు. తెలంగాణ, ఢిల్లీ, విదేశాల్లో.. ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లు, ఉపాధి కోసం వెళ్లిన వాళ్లు లక్షల రూపాయలు ఖర్చును కూడా లెక్కచేయకుండా ఈసారి ఓటు వేసితీరాల్సిందే అనే సంకల్పంతో వచ్చి వాలిపోయారు. సాధారణంగా ఆయా పార్టీల వారు వాహనాలను ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తరలిస్తుంటారు. కానీ, ఈసారి మాత్రం తండోపతండాలుగా స్వచ్ఛందంగా, ఓ ఉద్యమం మాదిరిగా.. జాతర చందంగా ఓటర్లు పోటెత్తారు. ఈ తీరు చూస్తే ఏదో ఆవేదన వీళ్లను బ్యాలెట్ వరకూ పంపించిందనక తప్పదు. ఐదేళ్లలో నిరాశ, నిశిరాత్రిలో కూరుకుపోయిన మన రాష్ట్రాన్ని బయటకు తీసుకురావాలనే తపన, పిల్లలకు మళ్లీ మంచి భవిత చూపించాలనే తలంపు, ప్రజాస్వామ్యానికి ఊపిరిపోయాలన్న ఆరాటం ఓటరుకు ఓపికనిచ్చినట్లు పోలింగ్ సరళి రుజువు చేసింది. మొత్తానికి తన కర్తవ్యం నెరవేర్చిన ఓటరు.. జూన్ 4 కోసం ఎదురు చూస్తున్నాడు ఆశగా..! - రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



అభ్యర్థులు జాతకాలు ఇక్కడే : నన్నయ వర్శిటీలో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లు..

అ.. టెన్షన్

జూన్ 4న తేలనున్న భవితవ్యం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఓటరు సునామీలా వచ్చి తీర్పు ఇచ్చేశాడు.. ఒకటా రెండా ఎన్నడూ లేనిది 80 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక అభ్యర్థులందరిలోనూ టెన్షన్ ఆరంభమైంది. ఈవీఎంలలో వారి జాత కాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఎవరి ధీమా వారిదే. టీడీపీ,జనసేన, బీజేపీ వర్గాల్లో భలే జోష్ కనిపిస్తోంది. వైసీపీ వర్గాలు ఏదో నిరుత్సాహంగా ఉన్నాయి. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఓట్లు రావని తెలిసిన స్వతంత్ర అభ్యర్థులు పొరపాటున తమకు ఓట్లేసి ఉంటారేమో అనే ధీమాతో కూడా ఉండడం గమనార్హం. ఎవరికి ఏ ధీమా ఉన్నా అందరికీ టెన్షన్ ఉంది.జూన్ 4వ తేదీ వరకూ టెన్షన్ తప్పదు.ఏకంగా 20 రోజులు ఓటరు తీర్పు కోసం అభ్యర్థులు వేచిచూడాల్సిందే. కూటమి వర్గాలు మాత్రం జిల్లాలో క్లీన్ స్వీప్ చేస్తామని చెప్పుకుంటూ సంబరపడుతున్నాయి.జిల్లాలో ఒక పార్లమెంట్, 7 నియోజకవర్గాల్లో మొత్తం 83 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న సంగతి తెలిసిందే. వీటిలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత వంటి ముఖ్యనేతలు తమ భవిష్యత్ పరీక్షించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకత సునామీగా మారినట్టు చెబుతున్నారు.దీంతో కూటమిలో గెలుపు ధీమా కనిపిస్తోంది. రాజమండ్రి లోక్‌సభ కూటమి బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కొన్ని చోట్ల క్రాస్ ఓటింగ్ జరిగినా ఆమెకు తిరుగులేని ఫలితాలు వచ్చాయనే వాదన ఉంది. ఇక కూటమి టీడీపీ అభ్యర్థులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి (రాజమండ్రి రూరల్), ఆదిరెడ్డి వాసు (రాజమండ్రి సిటీ), ముప్పిడి వేంకటేశ్వరరావు (కొవ్వూరు), మద్దిపాటి వెంకట్రాజు (గోపాలపురం), జనసేన అభ్యర్థులు కందుల దుర్గేష్ (నిడదవోలు), బత్తుల బల రామకృష్ణ (రాజానగరం), బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (అనపర్తి) గెలుపు ధీమాలో ఉన్నారు. తమదే విజయమని తమ శ్రేణులతో సంబరాలు చేసుకుంటున్నారు. ఎన్నికల ముందు వరకూ బెట్టింగ్‌లకు సవాల్ విసి రిన వైసీపీ మద్దతు దారులు వెనకడుగు వేస్తున్నా రు. వైసీపీ నుంచి రాజమండ్రి సిటీ అభ్యర్థిగా మార్గాని భరత్, రూరల్ నుంచి చెల్లుబోయిన వేణు, రాజానగరం నుంచి జక్కంపూడి రాజా, అన పర్తి నుంచి డా.కె.సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరు నుంచి తలారి వెంకట్రావు, నిడదవోలు నుంచి జి. శ్రీనివాసనాయుడు, గోపాలపురం నుంచి తానేటి వనిత పోటీ పడిన సంగతి తెలిసిందే. వారి ధీమా వారికి ఉన్నప్పటికీ వారి అనుచరులు, పార్టీ శ్రేణు ల్లో మాత్రం నమ్మకం లేదు. గోదావరి జిల్లాలో వైసీపీ నేతలు సుమారు 6 సీట్ల మీద బొటాబొటీ నమ్మకం పెట్టుకోవడం మినహా, ఎవరిలోనూ ధీమా లేదు. కూటమి శ్రేణులు, నేతల్లో ఐక్యత కనిపిస్తే ఒంటిరిగా పోటీ చేసిన వైసీపీలో గ్రూపులు, వెన్నుపోట్లు కూడా కనిపించాయి.

- జిల్లాలో 83 మంది పోటీ
- ఈవీఎంలలో అభ్యర్థుల జాతకాలు
- స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం
- ఎవరి ధీమా వారిది.. కూటమిలో జోష్
- వైసీపీలో కనిపించని ఉత్సాహం
- బెట్టింగ్‌లకు వెనుకడుగు

80.93 శాతం పోలింగ్

జిల్లాలో ఓట్ల పోలింగ్ శాతం ఫైనల్ వివరాలను మంగళవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత ప్రకటించారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రకటించిన దానికంటే స్వల్పంగా శాతం పెరిగింది. మొత్తం జిల్లాలో 80.93 శాతంగా పోలింగ్ నమోదైంది. రాజానగరం నియోజకవర్గంలో అత్యధికంగా 87.53 శాతం నమోదు కాగా అత్యల్పంగా రాజమండ్రి సిటీలో 67.57 శాతం నమోదైంది. గోపాలపురంలో 86.67 శాతం, అనపర్తిలో 86.23 శాతం, కొవ్వూరులో 85.90 శాతం, నిడదవోలులో 84.67 శాతం,రాజమండ్రి రూరల్‌లో 73.02 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అనపర్తి	2,26,053	1,94,924	86.23
గోపాలపురం	2,42,763	2,10,399	86.67
కొవ్వూరు	1,84,136	1,58,176	85.90
నిడదవోలు	2,13,396	1,80,688	84.67
రాజమండ్రి సిటీ	2,67,484	1,80,733	67.57
రాజమండ్రిరూరల్	2,72,826	1,99,220	73.02
రాజానగరం	2,16,491	1,89,505	87.53
తూర్పుగోదావరి	16,23,149	13,13,645	80.93

3,09,504 మంది ఓటర్లు గైర్హాజర్

జిల్లాలో మహిళా ఓట్లు ఎక్కువ. కానీ ఓటేసింది మాత్రం పురుషులే.జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా 13,13,645 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది. 80.93 శాతం.మొత్తం జిల్లాలో 3,09,504 మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు.జిల్లా ఓటర్లలో పురుషులు 7,92,317 మంది ఉండగా 6,66,133 మంది ఓటేశారు.1,44,543 మంది ఓటు వినియోగించుకోలేదు. జిల్లాలో మహిళా ఓటర్లు 8,30,735 మంది ఉండగా 6,66, 113 మంది ఓటేశారు.మహిళల్లో 1,64,622 మంది ఓటు హక్కు వినియోగించు కోలేదు. కొత్త ఓటర్లు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.మొత్తం జిల్లాలో 3,09,504 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు.ఈ సారి సుదూర ప్రాంతాల ఓటర్లు కసిగా వచ్చి ఓటేయడంతో 2019 ఎన్నికల కంటే ఓటర్ల సంఖ్య పెరిగింది.



స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరచి సీల్ వేసిన పార్లమెంట్ పరిశీలకుడు సుబ్రహ్మణ్యం, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత, ఆర్‌డీవో చైత్ర వర్షిణి

ఓటరు తీర్పు భద్రం..

దివాన్‌చెరువు/ రాజానగరం, మే14 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని.. ఈవీఎంలను కేంద్ర బలగాల రక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి కె.మాధవీలత తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈస్ట్రన్‌బ్లాక్ 2వ అంతస్తులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలను మంగళవారం ఉదయం రాజమండ్రి పార్లమెంట్, అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కే. బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో స్క్రూటినీ అనంతరం భద్రపరచి గదులకు సీల్ వేశామన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో పోలైన ఓట్లను అనుసరించి ఈవీఎం లలో పోలైన ఓట్లు ఫారం17ఏ రిజిస్టర్, పీవో డైరీ17 సి అనుసరించి స్క్రూటినీ చేశారు. రికార్డుల నిర్వహణ, ఈవీఎం యూనిట్స్‌లో పోలైన ఓట్లసంఖ్య రాజకీయపార్టీల, అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నన్నయ వర్సిటీలో ఏర్పాటు చేసిన 14 గదుల బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు జూన్ 4వ తేదీ వరకూ భద్రంగా ఉంటాయి. పీవో, ఏపీవోలకు ఇతర జిల్లాల్లో రూ.2 వేలు, రూ. 1050 ఇస్తే.. జిల్లాలో మాత్రం పీవో, ఏపీవోలకు రూ.1400, రూ.750 ఇవ్వడం ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. ఈ మేరకు ప్రత్యేక బలగాలు నిఘా ఉంచాయి. ఈ ప్రక్రియలో రాజానగరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఏ.చైత్రవర్షిణి, రాజమండ్రి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత బలగాలు



ఉడిమూడి రహదారిపై మృతుల బంధువుల ధర్నా

దూసుకొచ్చిన మృత్యువు

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్‌టీసీ బస్
- నలుగురు అక్కడికక్కడే మృతి
- మరో ఆరుగురికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- ధాన్యం లోడ్ చేస్తుండగా ఘటన
- ఉడిమూడి వద్ద ప్రమాదం
- రెండు గ్రామాల్లో తీవ్ర విషాదం
- న్యాయం చేయాలని ధర్నా

పి.గన్నవరం/అంబాజీపేట/రావులపాలెం, మే 14 : ఉదయం నుంచి ఆనందంగా పనిచేస్తున్నారు.. కాసేపట్లో పనిముగించుకుని ఇళ్లకు వెళ్లిపోదామని చీకట్లోనే పని చేస్తుండగా ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది.. నలుగురు కూలి బతుకులను కూల్చివేసింది.. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద 10 మంది కూలీలు ట్రాక్టర్‌పై ధాన్యం లోడు చేస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురు అక్కడిక్కడే మృతిచెందారు. జట్టు కూలీలతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. పి.గన్నవరం మండలం ఆదిమూలవారిపాలెంలో ఒకే కుటుంబానికి చెందిన చిలకలపూడి మణిబాబు (31), చిలకలపూడి సురేష్, గంటి పెదపూడి గ్రామానికి చెందిన నూకపెయ్యి శివ (32), వాసంశెట్టి సూర్యప్రకాష్ (48), ఈరి కట్టయ్య (46)లతో పాటు మరో ఆరుగురు కలిసి మంగళవారం తెల్లవారుజామున ధాన్యం లోడు చేసేందుకు చింతావారిపేట వచ్చారు.ఉదయం నుంచీ ధాన్యం పట్టుబడులు పట్టి రాత్రి 7 గంటల సమయంలో ప్రధాన రహదారి చెంతనే ట్రాక్టర్ ధాన్యం బస్తాలను లోడ్ చేసి పగ్గం బిగిస్తున్నారు.ఈ సమయంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టరును బలంగా ఢీకొని జట్టు కూలీలపై నుంచి దూసుకుపోయింది.నలుగురు అక్కడిక్కడే మృతి చెందగా బస్సు సుమారు 10 మీటర్ల మేర ఈడ్చుకుపోవడంతో మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో రహదారిపై చిందవందరగా పడ్డాయి. దీంతో భయానక వాతావరణం ఏర్పడింది. మృతదేహాల వద్ద కుటుంబీకులు రోదిస్తున్న తీరు ప్రయాణికులను సైతం కలిచివేసింది. ఒక మృతదేహం నుజ్జునుజ్జుకావడంతో మూటకట్టారు.ఇద్దరికి తీవ్ర గాయాలు నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. జట్టు కూలీలు చిలకలపూడి సురేష్, బొరుసు నానిలకు తీవ్ర గాయాలయ్యాయి. సురేష్‌ను తొలుత పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. నానితో పాటు గాయాలపాలైన ప్రయాణికులను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పి.గన్నవరం నుంచి ఈతకోట వెళ్లే రహదారిలో ప్రయాణం ప్రమాదభరితమే. ప్రధాన పంట కాలువకు రక్షణగోడ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని స్థానికులు చెప్పారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో కనీసం వీధిలైట్లు కూడా లేవు. సెల్ ఫోన్ల లైట్ల వెలుగులో పోలీసులు మృతదేహాలను గుర్తించి వివరాలు నమోదు చేయాల్సి వచ్చింది. అందరితో కలుపుగోలుగా ఉండే వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కలచివేసింది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యప్రకాష్,ఈరి కట్టయ్య, ఆదిమూలవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబీకులు రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహాలతో మృతుల కుటుంబీకులు, స్థానికులు ధర్నాకు దిగారు.ఒక్కొక్కరికీ రూ.10లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో రావాలని నినాదాలు చేశారు.న్యాయం చేసే వరకు మృతదేహాలను తరలించ మంటూ భీష్మించారు.ఆర్‌డీవో వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద స్థలికి కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ,సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ బి.శివకృష్ణ చేరు కుని మృతుల వివరాలు సేకరించారు.ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవరు సంఘటనాస్థలానికి రావాలంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు.మృతదేహాలను జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కూటమి శ్రేణులు పరిశీలించారు.రోడ్డు ప్రమాద మృతుల కుటుం బీకులు ఒక్కొక్కరికీ రూ.లక్ష వంతున సాయం అందిస్తానని పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ప్రకటించారు. కూటమి శ్రేణులు శిరిగినీడి వెంకటేశ్వరరావు,సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు, రుద్రరాజు వీరభద్రరాజు, అరిగెల సూరిబాబుతో పాటు పలువురు ప్రమాద స్థలికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మృతుల కుటుంబీకుల రోదన



మణిబాబు కట్టయ్య సూర్యప్రకాష్

ఇక వెళ్లొస్తాం..



- ఓటర్లు తిరుగు ప్రయాణం
- రైళ్లలో కిక్కిరిసిన జనం
- రంగంలోకి రైల్వే రక్షక దళం
- వేరే రైళ్లలో సర్దుబాబు
- 600 మంది ప్రయాణికుల దించివేత
- టిక్కెట్ లేకపోవడమే కారణం

రాజమహేంద్రవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటు వేసి తిరుగు ప్రయాణమైన వారు రైళ్లల్లో పోటెత్తారు. దీంతో రాజ మండ్రి రైల్వే స్టేషన్ జాతరను తలపించింది. రైల్వే స్టేష ను జనంతో నిండిపోయింది. రిజర్వేషనుతో సహా అన్ని బోగీలు కిక్కిరిసిపోయాయి. కనీసం కాలు కదపడానికీ వీలు లేకుండా పోయింది. రిజర్వేషనులో 80, సాధారణ బోగీలో 90 సీట్లు ఉండగా రెండిటికీ తేడా లేకుండా ప్రతి బోగీలో సుమారు 300-400 మంది అతికష్టంపై ప్రయాణిస్తున్నారు. ఒక కూపేలో 8 మంది ప్రయాణించడానికి వీలుండగా 20 మందికిపైగా ఉంటున్నారు. బోగీల తలుపుల వద్ద ప్రయాణికులు వేలా డుతూ కనిపించారు.ఓట్ల పండుగకు తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన ఓటర్లు సోమ, మం గళవారం తిరుగు ప్రయాణమయ్యారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వైపు వెళ్లే రైళ్లలో మరీ దారుణమైన పరిస్థితి ఉంది. పిల్లలు, మహిళలు, వృద్ధులు నలిగిపోతున్నారు. రాజమండ్రి గుండా 120కిపైగా రోజువారీ, వారాంతపు రైళ్ల ప్రయా ణిస్తుంటాయి. వీటికితోడు ప్రత్యేక రైళ్లను వేశారు. ఇప్పటికే ఉన్న రైళ్లకు అదనపు బోగీలను తగిలించారు. అయినా అన్ని రైళ్లూ నిండు కుండల్లా రాకపోకలు సాగిస్తున్నాయి. మూడు రోజుల సెలవులు సోమవారం (పోలింగ్)తో ముగిశాయి. మంగళవారం నుంచి విధులకు హాజరు కావాల్సి ఉంది. దీంతో పెద్ద సంఖ్యలో జిల్లా నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఇటు కోనసీమ, అటు ఏజెన్సీ ప్రాంతాలకు రాజమండ్రి రైలు ప్రయాణ గేట్‌వే వంటిది. ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు నేరుగా రైలు సదుపాయం ఉండడంతో సాధారణ రోజుల్లో 10 వేల వరకూ.. ప్రత్యేక దినాల్లో 20 వేల మంది వరకూ రాకపోకలు సాగిస్తుంటారు.ఇప్పుడు ఆ సంఖ్య 30 వేల వరకూ ఉన్నట్లు కనిపిస్తోంది. మరో మూడు నాలుగు రోజులు ఇలాగే ఉండే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు. రద్దీ విపరీతంగా ఉండడంతో స్థానిక రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.ప్రయాణికుల భద్రత దృష్ట్యా పోస్ట్ కమాండర్ సైదయ్య నేతృత్వంలో రైల్వే రక్షణ దళం(ఆర్పీఎఫ్) సిబ్బంది రంగంలోకి దిగారు.ప్లాట్‌ఫాంలు, బోగీల్లో తనిఖీలు చేపట్టడంతో పాటు ప్లాట్‌ఫాంలపై, బోగీల్లోని ప్రయాణికులకు సాధ్యమైన సహాయం చేస్తున్నారు. విపరీతమైన రద్దీగా ఉన్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌తో సహా 10 రైళ్లను నిలిపివేసి కొందరు ప్రయాణికులను వేరే రైళ్లలోకి సర్దుబాటు చేశారు. దిబ్రూగఢ్-కన్యాకుమారి,



విశాఖ-హైదరాబాద్(గోదావరి), కాకినాడ-లింగంపల్లి(గౌతమి), స్పెషల్ రైలు(06563)లోని సుమారు 600 మంది టికెట్టు లేని ప్రయాణికులను దించేశారు. హైదరాబాద్-విజయవాడ, రాజమండ్రి, విశాఖకు వారం రోజులపాటు అయినా ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.రద్దీ దృష్ట్యా రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పలు రైళ్లకు అదనపు బోగీలు వేశారు. అయితే వీటిపై సరైన ప్రచారం లేకపోవడంతో అక్కరకు రావడం లేదు. తమకు తెలిసిన రైళ్లనే ప్రయాణికులు ఆశ్రయిస్తుండడంతో సమస్య ఏర్పడుతోంది. ప్రయాణికులు కిక్కిరిసిపోవడంపై రైలు మదద్‌కి విపరీతంగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. రద్దీ సమయంలో రైళ్ల గురించి పబ్లిక్ అనౌన్స్‌మెంట్ ద్వారా పదే పదే చెబుతూ ఉంటే సాధారణ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

చల్లబడ్డారు..

- నిన్నటి వరకూ ఇటు వేసవి తాపం
- మరో పక్క ఎన్నికల తాపం
- పోలింగ్‌తో అభ్యర్థులకు ఉపశమనం
- వాన రాకతో ఊపిరిపీల్చుకున్న ప్రజలు

గోపాలపురం, మే 14: భగభగ మండే మే నెల మండుటెండలు మంగళవారం సాయంత్రానికి కురిసిన భారీ వర్షంతో వేసవితాపం చల్లబడింది. గత కొన్ని రోజులుగా మండుటెండలు సైతం లెక్క చేయకుండా రేయింబవళ్ళు మండిన ఎన్నికల వేడి సోమవారం జరిగిన పోలింగ్‌తో చల్లబడింది. అటు మండుటెండలు, ఇటు ఎన్నికల వేడి చల్లబడడంతో గ్రామాల్లో ఏ బడ్డీకొట్టు వద్ద చూసినా ఎన్నికల ఫలితాలపై చర్చ సాగుతోంది. నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీల మధ్య గెలుపు ఒకరిదంటే ఒకరిదంటూ మాటల కాలక్షేపంతో ఒకటికి రెండు టీలు తాగడంతో టీ కొట్లు వద్ద రద్దీ పెరుగుతోంది. ఒక పక్క ఈదురుగాలులతో కూడిన వర్షం మరో పక్క నెలరోజులుగా ఎన్నికల ప్రచారంలో ఎదురైన తీపిగుర్తులు నెమరవేసుకుంటూ సాగుతున్న చర్చంతా కాలం మారిందా వర్షాకాలం ముందే వచ్చిందా అన్నట్టుగా ఉంది భారీ వర్షం తీరు. ఇది ఇలా ఉంటే మండలంలో మంగళవారం సాయంత్రం సుమారు 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు రావడంతో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో ఈదురుగాలులతో కూడిన వర్షం సుమారు గంటా 15 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. గత రెండు నెలలుగా అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కబోతకు గురైన ప్రజలకు వర్షంతో వేసవి తాపం నుంచి ఉపశమనం దొరికింది.



గోపాలపురంలో కురుస్తున్న వాన

అదే సమయంలో మండుటెండలు సైతం లెక్క చేయకుండా ఎన్నికల కోడ్ వచ్చిన మొదలుకుని మే 13వ తేదీ వరకు నిద్రహారాలు మాని కంటి మీద కునుకులేకుండా గెలుపునకు ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు క్షేత్రస్థాయి కేడర్ వరకు రేయింబవళ్ళు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మే 13వ తేదీ సోమవారం జరిగిన పోలింగ్‌తో సాధారణ ప్రజలు మొదలుకుని ఆయా పార్టీల నాయకుల వరకు నెలకొన్న ఉత్కంఠకు తెరపడి ఉపశమనం లభించింది. ఏది ఏమైనా మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో అటు వేసవితాపం, ఇటు ఎన్నికల తాపం అంతా చల్లబడినట్లయింది.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఈవీఎంలు స్ట్రాంగ్‌రూంలో భద్రం

కొవ్వూరు రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ



స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్ వేయిస్తున్న అబ్జర్వర్ కమల్‌కాంత్, ఆర్వో శ్రీవాస్తవ

కొవ్వూరు, మే 14: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తిచేసినట్టు ఈవీఎంలను కేంద్ర బలగాల రక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చినట్టు కొవ్వూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను సాధారణ ఎన్నికల పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్ అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ చేసి నన్నయ యూనివర్సిటీలో కేంద్ర బలగాల రక్షణలో స్ట్రాంగ్‌లో భద్రపరిచినట్టు చెప్పారు. మంగళవారం నన్నయ యూనివర్సిటీ ఎస్-బ్లాక్ రెండో ఫ్లోర్‌లో సౌత్ వెస్ట్ వింగ్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలను భద్రపర్చి సీల్ వేశామన్నారు. ఈ నెల 13న ఎన్నికల పోలింగ్ రోజున ఈవీఎంలలో పోలైన ఓట్లు, ఫారం-17ఏ రిజిస్టర్, పీవో డైరీ 17 సి, అనుసరించి స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించారు. రికార్డుల నిర్వహణ, ఈవీఎం యూనిట్స్‌లో పోలైన ఓట్ల సంఖ్య రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలో జరిగిన స్క్రూటినీ కమల్‌కాంత్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,84.136 మంది ఉండగా ఈవీఎంల ద్వారా 1,57,795 ఓట్లు పోలయ్యాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా నియోజకవర్గంలో 1527, ఇతర జిల్లాల్లో 225 కలిపి మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1752 పోలయ్యాయని సబ్ కలెక్టర్ తెలిపారు.

శత కలశాభిషేక మహోత్సవం



కొవ్వూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శత కలశాభిషేకం

కొవ్వూరు, మే 14: శ్రీ రాజ్యలక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి శత కలశాభిషేక మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం కొవ్వూరులోని బసివిరెడిపేటలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు గొడవర్తి వేణుగోపాలచార్యులు విశేష అభిషేకాలు చేశారు. ఆలయ జీర్ణోద్ధరణ, పునః ప్రతిష్ఠ జరిపారు. 108 కలశాలతో మండల అష్టోత్తర శత కలశాభిషేక మహోత్సవం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు, పద్మ దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు



దేవరపల్లి, మే 14: శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. 15న కోయల్ అల్వార్ తిరుమంజనం, 17న తిరువీధి ఉత్సవం, గజారోహణం, ఉత్సవ మూర్తులకు అభిషేకం, మంగళస్నానం, గరుడవాహన సేవ, కోలాట భజనా కార్యక్రమాలు, 18న ప్రత్యేక హోమాలు, శ్రీవారి రథోత్సవం, శ్రీనివాస కల్యాణం, అన్నమాచా ర్యుల సంకీర్తన స్వరాభిషేకం, 19న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పుష్పయా గం, 20న ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఎస్ఈబీ దాడిలో వ్యక్తి అరెస్టు

దేవరపల్లి, మే 14: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామంలో దాడులు నిర్వహించినట్టు సీఐ కేవీస్వామి, తెలిపారు. ఈ సందర్భంగా 12మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఎస్ఐ సుధీర్, సిబ్బంది దాడిలో పాల్గొన్నారన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

ఉండ్రాజవరం, మే 14: మండలంలోని తాడిపర్రు గ్రామంలో విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డొంకరాయిలో పుష్ప-2 షూటింగ్



లారీల్లో ఎర్రచందనం తరలింపును చిత్రీకిస్తున్న దృశ్యం

మోతుగూడెం, మే 14: వై.రామవరం మండలం బొడ్డగండి, డొంకరాయి పరిసర ప్రాంతాల్లో పుష్ప-2 షూటింగ్ జోరుగా జరుగుతోంది. సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ 99 శాతం పూర్తవగా తాజాగా కొన్ని సన్నివేశాలను మంగంపాడు పాలగడ్డ, డొంకరాయి గ్రామాల్లో మూడు రోజులు పాటు చిత్రీకరించారు. అల్లు అర్జున్ బాల్యంలో తోటి కుర్రవాళ్లతో క్రికెట్ ఆడడం, ఎర్రచందనం లారీలో తరలిస్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. బుధవారం నుంచి మోతుగూడెం పరిధిలో పొల్లూరు శివాలయం వద్ద సంత నిర్వహణ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. పొల్లూరులో అక్కడ దుకాణాలు పాకలను యూనిట్ బృందం సభ్యులు నిర్మిస్తున్నారు. ఈ షూటింగ్ రెండు రోజులు పాటు జరుగుతుందని తెలిపారు.

ఘనంగా వాసవీమాత జయంత్యోత్సవాలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్నఅర్చకులు

ధవళేశ్వరం, మే14: ధవళేశ్వరంలోని గోదావరి తీరాన ఉన్న శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి జయంత్యోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదురోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. బుధవారం కుంకుమ పూజలు, గురువారం విశేషపూజలు, శుక్రవారం పలు రకాల పుష్పాలతో పూజ, శనివారం ఉదయం దంపతుల, కన్యలతో పూజలు చేస్తారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతి రోజు సాయంత్రం ఆలయప్రాంగణంలో మహిళా సమాజం ఆధ్వర్యంలో లలిత సహస్రనామ పారాయణం, పేరంటం జరిపి ప్రసాద వితరణ చేస్తారు. ఉత్సవా ల్లో యువ వైశ్యసభ్యులు ప్రధాన రహదారిపై మజ్జిగ పంపిణీ చేయనున్నారు.

ఏకలవ్య పాఠశాలలో నూరుశాతం సీబీఎస్ఈ ఫలితాలు

వై.రామవరం, మే14: మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి, 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. పదో తరగతిలో 77 మంది హాజరవగా అందరూ ఉత్తీర్ణులయ్యారని, అలాగే 12వ తరగతిలో 82 మందికి 82 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.

ఓట్ల వరద



రాజమహేంద్రవరంలో సోమవారం ఓటు వేసేందుకు లైన్లలో భారీగా వేచి ఉన్న ఓటర్లు

- 2019 ఎన్నికలతో పోల్చితే భారీగా పెరిగిన ఓటింగ్
- జిల్లాలో మొత్తం ఓటర్లు 16,23,149 మంది
- ఓటు హక్కు వినియోగించుకున్న వారు 12,89,298 మంది
- అత్యధికం రాజానగరం(86.16శాతం)
- అత్యల్పం రాజమహేంద్రవరం సిటీ (66.72శాతం)

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జనం కసిగా ఓటేశారు. బాధ్యత ఎరిగిన ఓటెత్తారు. గతంలో ఎన్నడూ కనిపించ నంత కసిఓటర్లలో కనిపించింది. తెలంగాణ, బెంగుళూరు, చెన్నై, వంటి ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి ఓటర్లు వరదగా గోదావరి పోటెత్తారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ సోమవారం ఐదుగంటల వరకూ పోలైన ఓటర్ల వివరాలివి. ప్రతీ రెండు గంటలకు పోలైన ఓట్ల వివరాలను అధికారులు ప్రకటించారు.

మొదటి రౌండ్‌లో రాజమహేంద్రవరం రూరల్‌లో 9.81శాతంగా ఎక్కువ ఓట్లు పోలవ్వగా, నిడదవోలు 5.84శాతం ఓట్లే పోలయ్యాయి. తర్వాత ఓటింగ్ శాతం బాగా పెరిగింది. క్రమక్రమంగా పుంజుకుని వరద గోదారిలా ఓటర్లు తరలి వచ్చి అర్ధరాత్రి వరకూ ఓట్లు వేశారు.

● అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 2,26,053 మంది ఓటర్లు ఉండగా, 1,94,924 మంది ఓటేశారు. ఉదయం 9గంటలకు 7.59శాతం ఓట్లు పోలయ్యాయి. 11గంటలకు 48,641మంది ఓటేశారు. ఇది 21.52శాతం, ఒంటి గంటకు 3.295శాతం, 3గంటలకు 53.76శాతం, 5గంటలకు 69.07శాతం ఓటు వేశారు. రాత్రి 9గంటలకు 80.9శాతం, 12గంటలకు 86.23శాతం ఓట్లు పోలయ్యాయి.

● రాజానగరంలో మొత్తం ఓటర్లు 2,16,491 మంది ఉండగా 1,89,505 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 9గంటలకు 7.81శాతం, 11గంటలకు 22.91శాతం, 1గంటకు 33.64శాతం, 3గంటలకు 54.16శాతం, 5గంటలకు 68.71శాతం ఓట్లు పోలయ్యాయి. రాత్రి 9గంటలకు 80.97 శాతం, 12గంటలకు 87.53శాతం ఓట్లు పోలయ్యాయి.

● రాజమహేంద్రవరం సిటీలో మొత్తం ఓటర్లు 2,67,484 మంది ఉండగా 1,80,733 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 9గంటలకు 8.58శాతం, 11గంటలకు 21.2శాతం, 1గంటకు 31.91శాతం, 3గంటలకు 47.13శాతం, 5గంటలకు 58.2శాతం. రాత్రి 9గంటలకు 65.95శాతం, 12గంటలకు 67.57శాతం ఓట్లు పోలయ్యాయి.

● రాజమహేంద్రవరం రూరల్‌లో మొత్తం ఓటర్లు 2,72,826 మంది ఉండగా 1,99,220 మంది ఓటేశారు. ఉదయం 9గంటలకు 9.81శాతం, 11గంటలకు 25.14శాతం, 1గంటకు 37.25శాతం, 3గంటలకు 53.92శాతం, 5గంటలకు 65.24శాతం ఓట్లు, రాత్రి 9గంటలకు 72.52శాతం, 12గంటలకు 73.02శాతం ఓట్లు పోలయ్యాయి.



పెరవలిలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు లైన్‌లో వేచి ఉన్న ఓటర్లు

● కొవ్వూరులో మొత్తం ఓటర్లు 1,84,136 మంది ఉండగా 1,58,176 మంది ఓట్లు వేశారు. ఉదయం 9గంటలకు 7.91శాతం, 11గంటలకు 23.10శాతం, 1గంటకు 34.21శాతం, 3గంటలకు 53.4శాతం, 5గంటలకు 69.27శాతం ఓటు పోలయ్యాయి. రాత్రి 9గంటలకు 81.34శాతం, 12గంటలకు 85.90శాతం ఓట్లు పోలయ్యాయి.

● నిడదవోలులో మొత్తం ఓటర్లు 2,13,396మంది ఉండగా 1,80,688 మంది ఓట్లు వేశారు. ఉదయం 9గంటలకు 5.84శాతం, 11గంటలకు 21.92శాతం, 1గంటకు 29.20శాతం, 3గంటలకు 52.99శాతం, 5గంటలకు 67.42శాతం ఓటు పోలయ్యాయి. రాత్రి 9గంటలకు 78.46శాతం, 12గంటలకు 84.67శాతం ఓట్లు పోలయ్యాయి.

● గోపాలపురంలో మొత్తం ఓటర్లు 2,42,763మంది ఓటర్లు ఉండగా 2,10,399 మంది ఓట్లు వేశారు. ఉదయం 9గంటలకు 8.72శాతం, 11గంటలకు 23.88శాతం, 1గంటకు 34.43శాతం, 3గంటలకు 56.24శాతం, 5గంటలకు 70.14శాతం ఓటు పోలయ్యాయి. రాత్రి 9గంటలకు 81.12శాతం, 12గంటలకు 86.67శాతం ఓట్లు పోలయ్యాయి.

రాజకీయ నాయకుల హర్షం

పెరవలి, మే 14: ఎన్నికలు సందర్భంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో అధిక సంఖ్యలో ఓటర్లు ఓటు వేయడంతో పలు రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు నెల రోజులు పాటు అహర్నిశలు శ్రమించి కోట్లాది రూపాయలు వెదజల్లి పోలింగ్ రోజు కోసం ఎదురు చూస్తే వర్షం వస్తే కనీసం సగం మంది కూడా ఓట్లు వేయడానికి వెళ్లరేమోనని నాయకులు భయపడ్డారు. కాని వాతావరణం అనుకూలించి ఒక్క చినుకు కూడా పడకపోవడంతో కొన్ని గ్రామాల్లో 95శాతం పోలింగ్ జరిగింది. దీంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.

అదే బరితెగింపు





బిక్కవోలు మండలం రంగాపురంలో వైసీపీ కార్యకర్తల రాళ్ల దాడిలో గాయపడ్డ టీడీపీ కార్యకర్త కానాటి దుర్గయ్యను పరామర్శిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (ఫైల్)

- పలుచోట్ల టీడీపీ నాయకులపై వైసీపీ దాడులు
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన
- జిల్లాలో కేసులు నమోదు

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): పుట్టిమునిగిపోక తప్పదని తెలిసిన వైసీపీ నాయకులు కవ్వింపునకు దిగారు. ఓటింగ్ సరళిని చూసి అసహనానికి గురై వెకిలి చేష్టలతో పలుచోట్ల జులుం ప్రదర్శించారు. అకారణంగా టీడీపీ కార్యకర్తలను కొట్టారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘించారు. సీసీ కెమెరాలు ఉన్నా వీసమెత్తు భయం, చట్టంపై గౌరవం లేకుండా ప్రవర్తించారు. పోలింగ్ రోజు మధ్యాహ్నం నుంచి ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరం సిటీలోని లాలాచెరువు పాఠశాల పోలింగ్ స్టేషను వద్ద సిటీ వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్‌కి అత్యంత సన్నిహితుడైన ఓ వ్యక్తి ఓటరుకు రూ.500 చొప్పున చేతిలో పెట్టారు. రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో ఓటు తమకే వేయాలంటూ ఓటర్లను ఒత్తిడి చేసిన వైసిపి నాయకులపై కేసు నమోదైంది. అనపర్తి నియోజకవర్గంలోని రంగాపురంలో టీడీపీ నాయకులపై వైసీపీ సర్పంచ్ రాళ్లతో దాడి చేశారు. ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని కడియంలో ఓటు వేసి ఇంటికి వెళ్తున్న టీడీపీ కార్యకర్తతో వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా గొడవ పెట్టుకొని కొట్టారు. కొవ్వూరు నియోజకవర్గంలోని కొవ్వూరు పట్టణంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించి పోలింగ్ స్టేషన్ వద్ద ప్రచారం చేస్తున్నారంటూ నిలదీసిన బీజేపీ నాయకులపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. వీటిపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ స్టేషనుకు 200మీటర్ల దూరం వరకూ వాహనాలు నిలపకూడదు. అలాగే గుంపులుగా జనం ఉండకూడదు. కానీ రాజమహేంద్రవరం సిటీలోని చున్నీలాల్ జాజు స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషను గేటుకు కేవలం రెండు మీటర్ల దూరంలో వైసీపీ నాయకులకు చెందిన కారుని పార్క్ చేశారు. పైగా ఆ కారుకు నంబరు కూడా లేదు. ఆ కారును 'ఆంధ్రజ్యోతి' ఫోటో తీస్తుండగా గమనించిన కానిస్టేబుల్ స్పందించి కారును పంపేశారు. అదే పోలింగ్ స్టేషనల్లో వెబ్‌కాస్టింగ్‌పై టీడీపీ నాయకులు అనుమానాలు వ్యక్తం చేశారు. క్రిమినల్ కేసులో ఉన్న ఒక యువకుడిని పోలింగ్ ఏజెంటుగా వైసీపీ తరపున నియమించారని ఆరోపించారు. అయితే, ఇదే పోలింగ్ స్టేషనల్లో జిల్లా ఎన్నికల అధికారి ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం.



పోలింగ్ స్టేషను గేటు వద్ద నెంబరు లేని వైసీపీ నాయకుల కారు

భారీ వర్షం



- రోడ్లపైకి చేరిన వాన నీరు.. ప్రయాణికుల ఇబ్బందులు
- మామిడి, జీడిమామిడి తోటలకు నష్టం
- యాదవోలులో పొంగిపొర్లిన వాగు డ్రైనేజీ

దేవరపల్లిలో డ్రైనేజీలు పొంగి ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

దేవరపల్లి/నల్లజర్ల/తాళ్లపూడి, మే 14: దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు వీస్తూ వర్షం పడింది. గ్రామాల్లో రోడ్లపై వర్షపు నీరు చేరి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగాయి.అక్కడక్కడ మొక్కజొన్న పంట వర్షపు నీటికి తడిసింది. ఈ వర్షం వల్ల మామిడి, జీడిమామిడి తోటలకు నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. వాతావరణం చల్లబడంతో వృద్ధులు, చిన్నారులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగింది. దేవరపల్లి మండలం యాదవోలు వాగు డ్రైనేజీ పొంగిపొర్లింది. డ్రైన్‌కు ఇరువైపులా ఉన్న ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఈ డ్రైనేజీ పూడిక తీయకపోవడం, ప్లాస్టిక్ బాటిల్స్ పేరుకుపోయి ఉండడం వల్ల నీరు ముందుకు పారక డ్రైన్ పొంగి పొర్లింది. పంచాయతీ అధికారులు పూడిక తీసి ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. కొద్దిపాటి వర్షానికే ఇలా డ్రైన్ పొంగి ఇళ్లలో నీరు చేరిందని, వచ్చే వర్షాకాలంలో భారీ వర్షాలు పడితే ఈ వాగుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు ముంపునకు గురవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దేవరపల్లిలో సాయంత్రం గాలి, వాన పడడంతో పోలింగ్ స్టేషన్ సమీపంలో దేవరపల్లి-గుండుగొలను రహదారిపై భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. రోడ్డుకు సగం పైగా పడి ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాన్ని అధికారులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. తాళ్లపూడిలో సుమారు 20 నిమిషాల పాటు కురిసిన వర్షానికి మెయిరోడ్డు జలమయమైంది. వాహనదారులుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థను సరి చేయాలని లేదంటే వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని పలువురు అంటున్నారు.



తాళ్లపూడిలో జలమయమైన ప్రధాన రహదారి



నల్లజర్లలో రోడ్డుపైకి చేరిన వర్షపునీరు

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి

- కడియంలో పేపరుమిల్లు ఎదుట గ్రామస్థుల ధర్నా

కడియం, మే 14: పేపరుమిల్లు కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ కడియంలో బాధ్యత సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థులు డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే... కడియం గ్రామానికి చెందిన గోక వాసు(45) స్థానిక పేపరుమిల్లులో కాంట్రాక్టు పద్ధతిలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లాడు. కడుపునొప్పి రావడంతో పేపరుమిల్లు ద్వారా రాజమహేంద్రవరం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే వాసు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దాంతో మృతదేహాన్ని కడియం తీసుకొచ్చారు. విషయం తెలిసి పేపరుమిల్లు ప్రతినిధులతో బాధ్యత సేవా సంస్థ అధ్యక్షుడు, కడియం సొసైటీ అధ్యక్షుడు గిరజాల బాబు మాట్లాడారు. దీంతో యాజమాన్యంతో మాట్లాడతామని ప్రతినిధులు చెప్పి వెళ్లిపోయారు. మిల్లు యాజమాన్యం పట్టించుకోలేదని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బాబు, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, గ్రామస్థులు మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి పేపరుమిల్లుకు వెళ్లి శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. బాబు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆవరణలో చనిపోయిన వ్యక్తికి ఎటువంటి నష్టపరిహారం ఇవ్వడానికి మేనేజ్‌మెంట్ ముందుకు రాకపోవడం దారుణమన్నారు. తక్షణమే స్పందించి వాసు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



పేపరుమిల్లు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బాబు, గ్రామస్థులు

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలమైన పునాది

ఎన్నికల సరళిపై సమీక్ష సమావేశంలో గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, మే 14: రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో మంగళవారం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు ఎన్నికల సరళిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది కార్యకర్తలని, తనకు మద్దతుగా నిలిచి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బూత్ ఏజెంట్ల కృషి మరువలేనిదని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో గుర్తింపు ఉందని, ఇకపై ప్రజా సమస్యలపై పోరాడి వారికి అండగా ఉండి వారికి నమ్మకాన్ని పొందాలన్నారు. ఈ సందర్భంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు రాజమహేంద్రవరం సిటీ నుంచి బోడా వెంకట్, రూరల్ నుంచి బాలేపల్లి మురళీధరరావు, రాజానగరం నుంచి ముండ్రు శ్రీనివాస్, అనపర్తి నుంచి శ్రీనివాసరావు, కొవ్వూరు నుంచి అరిగెల అరుణకుమారి, నిడదవోలు నుంచి పెద్దిరెడ్డి సుబ్బారావు, గోపాలపురం నుంచి మార్టిన్ లూథర్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజా కలిసి గిడుగు రుద్రరాజు దంపతులను సత్కరించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవం



కడియపులంక హరిహర క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడియం, మే 14: కడియపులంక హరిహర క్షేత్రంగా బాసిల్లుతున్న హరిహర మహాక్షేత్రంలో వేంకటేశ్వరస్వామి 7వ వార్షికోత్సవం ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు మంత్రోచ్చారణల మధ్య శ్రీలక్ష్మీవేంకటేశ్వర హోమం, పంచామృతాభిషేకం, శ్రీవారి పాదసేవ, అగ్నిమథనం, అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో నర్సరీ రైతులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు అభినందనీయం



వృద్ధురాలిని వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రాజానగరం, మే 14: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్‌సీసీ క్యాడెట్లు అందించిన సేవలు అభినందనీయమని సుబేదార్ భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వివేక్ సావన్‌గౌడర్ ఆదేశాల మేరకు గైట్ కళాశాలలోని 27 మంది ఎన్‌సీసీ క్యాడెట్లతోపాటు 164 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో 13న జరిగిన ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఉదయం నుంచి అర్ధరాత్రి పోలింగ్ ముగిసే వరకు విశేషసేవలందించి, పోలీసుల అభినందనలు అందుకున్నట్టు చెప్పారు. సమావేశంలో గైట్ ఎన్‌సీసీ ఏఎస్‌వో ఎ.తేజేశ్వరరాజు పాల్గొన్నారు.

నల్లమిల్లిని కలిసిన మహిళా నేతలు



అనపర్తి, మే 14: మండలం రామవరంలో మంగళవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని బీజేపీ మహిళామోర్చా జాతీయ కార్యదర్శి మాలతీరాణి, టీడీపీ తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్ళారి సాయికళ్యాణి మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో నల్లమిల్లి భారీ మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు.